కన్యకాపరమేశ్వరికి వజ్రాలహారం బహూకరణ



అమ్మవారికి వజ్రాల హారం సమర్పిస్తున్న ఆర్యవైశ్యం సంఘం నాయకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని అమ్మవారిశాలలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరికి పలువురు వ్యాపారులు వజ్రాల హారాన్ని బహూకరించారు. ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ మాట్లాడుతూ దాతల సహకారంతో వజ్రాలు పొదిగిన సుమారు రూ.25 లక్షలు విలువ చేసే హారాన్ని తయారు చేయించి అమ్మవారికి సమర్పించామన్నారు. పలువురు ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పొలం దస్త్రాల్లో పేర్ల మార్పుపై విచారణ

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తితోపాటు పలుగ్రామాల్లో పొలం ఒకరిది... పేరు మరొకరిదిగా దస్త్రాల్లో నమోదు కావడంపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం 'కాసులకు కక్కుర్తిపడి.. ప్రజల ఆస్తిపరులపాలు' అనే శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన కథనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. సమగ్రంగా విచారణ చేసిన తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దారు ఓబులేశును ఆదేశించారు. ధర్మాపురం, గుత్తి, పెద్దొడ్డి గ్రామాలకు చెందిన రైతులతో విచారణ చేపట్టారు. రైతుల వివరాలు సేకరించి విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపారు.

కుష్ఠు రోగి పింఛనూ

తొలగించారయ్యా!

కలెక్టర్‌తో వృద్ధురాలి ఆవేదన



పింఛన్ తొలగించారంటూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవిస్తున్న వృద్ధురాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'అయ్యా.. నా కొడుకు కుష్ఠు రోగి. చేతులు, కాళ్లు బాగలేవు. కొన్నేళ్లుగా పింఛన్ ఇచ్చారు. మూడేళ్ల కిందట తొలగించారు. ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చినా ఎవరూ స్పందించలేదు' అంటూ ఓ వృద్ధురాలు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మొర పెట్టుకుంది. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తోపాటు.. డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఆనంద్, డీపీఓ నాగరాజు, తదితరులు అర్జీలు తీసుకున్నారు. మొత్తం 253 మంది బాధితులు తమ సమస్యల పరిష్కారానికి వినతులు అందజేశారు. ఈ క్రమంలోనే అనంత గ్రామీణ మండలం రుద్రంపేట పంచాయతీ అజయ్‌ఘోష్‌నగర్‌కు చెందిన ఎం.శ్రీనివాసులు, తన తల్లిని వెంట పెట్టుకుని వచ్చి అర్జీ ఇచ్చారు. చేతులు పని చేయవు. కాళ్లకు కుష్ఠు రోగం వచ్చింది. ఏ పనీ చేయలేడు. మీరైనా స్పందించి పింఛన్ వచ్చేలా చర్య తీసుకోవాలని వృద్ధురాలు వేడుకున్నారు. ఈ సమస్యపై తగిన చర్య తీసుకోవాలని అక్కడే ఉన్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, నగర కమిషనర్‌కు అప్పగించారు. అర్జీల స్వీకరణ తర్వాత జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ప్రతిశాఖ అధికారి, ఉద్యోగి నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు.


గూడు కట్టిన.. అక్రమం


- ఆరు అంచెల వడబోతలోనూ అనర్హులకు అవకాశం
- వైకాపా అనుయాయులకు ఇళ్ల మంజూరు



అనంతపురం నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలన

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: 'సంక్షేమ పథకాలకు పార్టీ చూడం.. మతం చూడం.. కులం చూడం.. అర్హతే ప్రామాణికం' అంటూ వైకాపా విస్తృత ప్రచారం చేసుకుంది. 2019 నుంచి 2024 మధ్యలో వైకాపా హయాంలో ఆరు అంచెల విధానం పరిగణనలోకి తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో లొసుగులను వైకాపా నాయకులు అనుకూలంగా మార్చుకున్నారు. పేదలైతే చిన్న చిన్న సాంకేతిక చిక్కులు ఉన్నా వారికి పథకాలు వర్తించకుండా ముప్పుతిప్పలు పెట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు అంచెల విధానాన్ని పక్కాగా అమలు చేయడంతో వైకాపాకు అనుకూలంగా ఉన్న వక్రమార్కులు గుట్టుగా సాగించిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇళ్లను నిర్మించుకున్నట్లు తేలింది. నిరుపేదలకు దక్కాల్సిన ఇళ్లను వైకాపా అనుయాయులైతే చాలు.. అనర్హులైనా.. అప్పనంగా అప్పగించేశారు. ఆరు అంచెల విధానంలో గృహనిర్మాణశాఖ నాడు అనర్హులుగా గుర్తించిన జాబితాను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం ఆయా జిల్లాలకు ఆదేశాలు ఇచ్చింది. అనర్హుల ఏరివేతపై గృహనిర్మాణ సంస్థ అధికార యంత్రాంగం తలమునకలైంది.





అనంతపురం అర్బన్‌లోనే అత్యధికం

ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయం, నాలుగు చక్రాల వాహనం, నివాస స్థలం, పొలం, విద్యుత్తు బిల్లు అంశాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఉంటేనే అర్హతగా పరిగణిస్తారు. ప్రమాణాల ప్రకారం లేకుంటే సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవడానికే అవకాశం ఉండదు. జిల్లాలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అనర్హుల సంఖ్య అధికంగా ఉంది. 938 మందిని అనర్హులుగా గుర్తించారు. ఇందులో అనంత నగరంలో 844 మంది, ఎ.నారాయణపురం 38, అనంత గ్రామీణ పంచాయతీ 19, రాజీవ్‌కాలనీ 5, రుద్రంపేట 32 మందిని అనర్హులుగా గుర్తించారు. నిజంగా వారంతా అనర్హులేనా కాదా గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి, పొరుగు సేవల ఉద్యోగి, ఇతర ఉద్యోగం చేస్తూ నెలకు రూ.12 వేల కంటే ఎక్కువ ఆదాయం పొందేవారు 323 మంది ఉన్నట్లు గుర్తించారు. వారు నిజంగా ప్రభుత్వ ఉద్యోగులై ఉండి ఆదాయం ఎక్కువగా పొందుతుంటే ప్రభుత్వ సొమ్ము రికవరీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



- శైలజ, గృహనిర్మాణ సంస్థ జిల్లా పీడీ

అనర్హుల జాబితా పంపారు. ఆదాయం, ఇతర అంశాలను లబ్ధిదారుల నుంచి తీసుకుంటున్నాం. ఇప్పటికే 184 మంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించగా అందులో 98 మంది అనర్హులుగా తేలారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన వేగంగా చేస్తున్నారు. అన్ని వివరాలు క్రోడీకరించి రాష్ట్ర శాఖకు నివేదిస్తాం.

సజావుగా మద్యం దుకాణదారుల ఎంపిక

లాటరీ పద్ధతిలో విజేతల ప్రకటన



లాటరీ తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ్‌నారాయణశర్మ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్త మద్యం దుకాణాల ఎంపిక సోమవారం ముగిసింది. అనంతపురం నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన లాటరీ ప్రక్రియలో 136 దుకాణాలకు విజేతలను ప్రకటించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ మధ్యాహ్నం 4 గంటలకు ముగిసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పర్యవేక్షణలో రెండు కౌంటర్లలో విజేతలను ఎంపిక చేశారు. ఒక కౌంటర్‌లో ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య, మరో కౌంటర్‌లో ఈఎస్ రామమోహన్‌రెడ్డిలు నిర్వాహకులుగా వ్యవహరించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ లాటరీ ప్రక్రియను పర్యవేక్షించారు.



లాటరీ కోసం వచ్చిన దరఖాస్తుదారులు

సిండికేట్‌గా మారి.. దరఖాస్తు చేసే సమయంలోనే కొందరు అధికార పార్టీ నాయకులు చాలా పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్లారు. వారి పరిధిలోని దుకాణాలకు ఐదునుంచి పదిమంది సిండికేట్‌గా మారారు. సిండికేట్ గ్రూపులోనే వారి పేర్లమీదే ఒక్కోదానికి ఒక్కొకరి పేరుపై దరఖాస్తు చేశారు. వారే లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. లాటరీ తీసిన రెండు కౌంటర్ల వేదికలపైనా వారే కనబడ్డారు. అలాగే తాడిపత్రి, గుంతకల్లు, బుక్కరాయసముద్రం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఎక్కువ శాతం కూడబల్కుని దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది.

తాడిపత్రిలో ఒకే కుటుంబానికి ఆరు

జిల్లాలోనే తక్కువ దరఖాస్తులు నమోదైన తాడిపత్రి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికంగా అధికార పార్టీ నాయకులే దక్కించుకున్నారు. ఇక్కడ మొత్తం 16 షాపులకు గాను 97 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. తాడిపత్రి అర్బన్, రూరల్‌లో 12 ఉండగా 34 దరఖాస్తులు అందాయి. 12 షాపుల్లో 6 కాకర్ల రంగనాథ్ కుటుంబ సభ్యులు ఎంపికయ్యారు. 91, 92, 94 నంబర్ల దుకాణాలను కాకర్ల రంగనాథ్, ఇతని సోదరుడు కాకర్ల జగన్నాథం 90 వది, మరో సోదరుడు కాకర్ల రంగనాయకులు 95, 99లను దక్కించుకున్నారు. అలాగే ఆత్మకూరు మండలం పి.సిద్ధరాంపురం గ్రామానికి చెందిన రాజనేని రమేశ్‌నాయుడు, అతని భార్య శ్రీదేవిలు కలిసి 4 దుకాణాలను చేజిక్కించుకున్నారు.

18 మహిళలకే.. ఈసారి మద్యం టెండర్లలో మహిళలు చెప్పుకోదగిన రీతిలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 136 దుకాణాలకు 3,080 మంది పురుషులు, 185 మంది మహిళలు దరఖాస్తు చేశారు. అయితే మొత్తం దుకాణాల్లో 18 షాపులను మహిళలే దక్కించుకున్నారు. 118 మంది పురుషులు విజేతలయ్యారు. సన్నపురెడ్డి సుజల అనే మహిళ ఏకంగా 4 దుకాణాలు విజేతగా నిలిచింది. ఈమె అనంతపురం గ్రామీణంలోని 32, 34, గుంతకల్లులో 79, కళ్యాణదుర్గంలో 130వ నంబరు దుకాణాలను దక్కించుకున్నారు. అలాగే రాజనేని శ్రీదేవి గుంతకల్లు పట్టణంలో 82, 84 షాపులను పొందారు.

35వ దుకాణ విజేతపై అభ్యంతరం

ఆత్మకూరు మండలంలో 35వ షాపును దక్కించుకున్న ఎం.స్వాతిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె అనంతపురం నగర పంచాయతీలో మహిళా పోలీసుగా పనిచేస్తోందని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. 'తాను ఏ ఉద్యోగం చేయలేదని, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నానని స్వాతి అధికారులకు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని, అందులో అనర్హురాలు అని తేలితే రిజర్వ్‌లో ఉన్నవారికి అవకాశం కల్పిస్తామని జేసీ వివరించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు పచ్చజెండా

ఈనెల 16 నుంచి నవంబర్ 24లోపు పూర్తి



భైరవానితిప్ప జలాశయం

రాయదుర్గం, న్యూస్‌టుడే: నీటిపారుదల వ్యవస్థలో కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈనెల 16న నోటిఫికేషన్ జారీ చేసి నవంబరు 24లోపు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగానే రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల తతంగాన్ని పూర్తి చేసేందుకు నోడల్ అధికారులను నియమించనున్నారు. ఆయా ప్రాదేశికాలలో సర్వేనెంబర్ల ప్రకారం రైతుల జాబితాను తయారు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టనుంది.

ఐదేళ్లలో పట్టించుకోని వైకాపా సర్కారు

1997లో తెదేపా ప్రభుత్వం సాగునీటి సంఘాల వ్యవస్థను తీసుకువచ్చింది. ఆ సమయంలోనే పంట కాలువల పరిధిలోని రైతులకు ఓటు హక్కు కల్పించింది. 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో సాగునీటి సంఘాల ఛైర్మన్లను నియమించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుపలేదు. తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పడ్డాయనే అక్కసుతో వాటిని రద్దు చేసింది. ఇరిగేషన్ అధికారులతోనే పనులు చక్కబెట్టింది. దాంతో సాగునీటి రంగానికి తీవ్ర నష్టం కలిగింది. చెరువులు, కాలువలను గాలికొదిలేసింది. వాటి అభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. కనీసం మధ్యతరహా ప్రాజెక్టుల నిర్వహణకు ఏడాదికోసారి కూడా నిర్వహణ నిధులు ఇవ్వలేదు. రైతులు సొంత నిధులతోనే కాలువలు బాగు చేసుకున్నారు. ఇక చిన్ననీటి పారుదల వ్యవస్థలో ఎలాంటి నిధులు మంజూరు కాక.. పనులు లేక అధికారులు మొక్కుబడిగా అప్పుడప్పుడు కార్యాలయాలకు వచ్చి వెళ్లేవారు.

89 చెరువులకు.. : జిల్లాలోని 89 చెరువులకు, రాయదుర్గం నియోజకవర్గంలో మధ్యతరహా ప్రాజెక్టుగా పేరుగాంచిన బీటీ ప్రాజెక్టు పరిధిలోని 6 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మరో 40 రోజుల్లో కొత్త కమిటీలు ఏర్పాటు కానున్నాయి. 30వేల ఎకరాలకు నూతన కమిటీలను ఎన్నుకోనున్నారు. ఒక్కో టీసీ(టెరిటోరియల్ కానిస్టెన్సీ) పరిధిలో నలుగురు నుంచి ఆరుగురు సభ్యులను ఎన్నుకోనున్నారు.

జేఎన్‌టీయూకు జాతీయస్థాయిలో 23వ ర్యాంకు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: లండన్‌కు చెందిన టైమ్స్ ఉన్నతవిద్య అనే అంతర్జాతీయ సంస్థ వెల్లడించిన ర్యాంకింగ్‌లో అనంతపురం జేఎన్‌టీయూకు జాతీయస్థాయిలో 23వ ర్యాంకు దక్కింది. గత సంవత్సరం ప్రకటించిన ర్యాంకుల్లో 34వ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం 23వ ర్యాంకు దక్కడం విశేషం. ప్రపంచస్థాయి ర్యాంకింగ్ మాత్రం మెరుగుపడలేదు. నిరుడు 801- 1000 మధ్య ర్యాంకు దక్కింది. ఈసారి కూడా 801-1000 మధ్యలోనే ర్యాకింగ్ వచ్చింది. మార్చిలో న్యాక్-ఏ గ్రేడ్ రావడం, అంతర్జాతీయ ప్రైవేటు సంస్థ ప్రకటించిన ర్యాంకింగ్‌లో మెరుగైన ర్యాంకు రావడంతో వర్సిటీకి ప్రాజెక్టులు, నిధులు మంజూరు కావడానికి అవకాశాలు లభిస్తాయి. విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు కేంద్రం నుంచి అనుమతి లభిస్తుంది. న్యాక్ గుర్తింపు కోసం దరఖాస్తు చేశారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ రావడానికి కూడా ఈ ర్యాంకు తోడ్పడుతుంది. ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.



ఐదుకల్లు సదాశివన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

హరిజనోద్యమ నాయకుడు

ఐదుకల్లు సదాశివన్

ఆజాద్‌నగర్(అనంతపురం), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు సీపీఐ వ్యవస్థాపకులు ఐదుకల్లు సదాశివన్ వర్ధంతి సభ అనంతపురంలోని సీపీఐ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం నిర్వహించారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన నాయకులు ఐదుకల్లు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో అనితర సాధ్యమైన కృషి చేసిన గొప్ప యోధుడు సదాశివన్ అని కొనియాడారు. రాయదుర్గంలో జన్మించిన ఆయన చిన్న వయసులోనే జాతీయోద్యమానికి అంకితం అయ్యారన్నారు. హరిజనులను అంటరానివారిగా సమాజానికి దూరంగా ఉంచుతున్న వ్యవస్థపై తిరగబడటమే కాకుండా, వారి పిల్లల భవిష్యత్తు కోసం ఉద్యమించారన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సీపీఐ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, లింగమయ్య, అల్లీపీరా, రమణ, సంతోశ్, సుందర్రాజు, చాంద్‌బాషా, జయలక్ష్మి, నాగప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ మహాకవి సమ్మేళనంపై

కవితల ఆహ్వానం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా రాయలసీమ మహాకవి సమ్మేళనానికి కవితలను ఆహ్వానిస్తున్నామని వేదిక సమన్వయకర్త అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను డిసెంబరు 8లోగా 99639 17187 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లోని కవులు సమ్మేళనంలో పాల్గొనవచ్చన్నారు. కవితలను పుస్తక రూపంలో తీసుకొస్తామన్నారు.

చకచకా రైల్వే మార్గాల పనులు

- రూ.170 కోట్లతో బైపాస్‌లైన్
- తుది దశలో నిర్మాణాలు

గుంతకల్లు, గుత్తి, న్యూస్‌టుడే: రైలు ప్రయాణం ఆలస్యం కాకుండా, సరకుల రవాణాను రెట్టింపు చేసేందుకు అవసరమైన పనులు చేపట్టడానికి రైల్వే బోర్డు ఆదేశాలతో గుంతకల్లు డివిజన్ అధికారులు సర్వేలు, నిర్మాణాలు, భూసేకరణ పనులు చేపట్టారు. ఆ పనులు గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) డిప్యూటీ చీఫ్ ఇంజినీరు కార్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ★ ప్రస్తుతం గుంతకల్లు-రేణిగుంట మధ్య సుమారు 308 కి.మీ.ల వరకు రెండు వరుసల రైల్వేలైన్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరో రెండు వరుసల లైన్ల కోసం చేపట్టిన సర్వే పనులు తుదిదశకు చేరుకున్నాయి. గుంతకల్లు నుంచి వాడి మధ్య 229 కి.మీ.ల వరకు ప్రస్తుతం ఉన్న రెండు వరుసల లైన్లకు తోడుగా మరో లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు.



గుంతకల్లులో డిప్యూటీ చీఫ్ ఇంజినీరు కార్యాలయం

ఏడాదిలోగా పూర్తవ్వాలి

గుత్తి-పెండేకల్లు (30కి.మీ.లు) మధ్య ప్రస్తుతం ఒక్క లైన్ మాత్రమే ఉంది. ఈ సెక్షన్‌లో మరో లైనుతో పాటు విద్యుద్దీకరణ చేపట్టడానికి ప్రభుత్వం రూ.170 కోట్లు కేటాయించి పనులను గుత్తేదారుకు అప్పగించారు. గుత్తేదారు ప్రాథమిక పనులు ప్రారంభించారు. ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక రూ.70 కోట్లతో మల్లప్పగేట్ నుంచి పడమర గుంతకల్లు స్టేషన్‌ను కలుపుతూ ప్రస్తుతం గుంతకల్లు జంక్షన్‌లోకి వచ్చే ఆదోని, బళ్లారి రైల్వేలైన్ల మీదుగా ఓవర్ రోడ్డు డబుల్‌లైన్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం భూసేకరణ ముమ్మరంగా సాగుతోందని అధికారులు చెబుతున్నారు. ★ నంచెర్ల నుంచి పడమర గుంతకల్లు స్టేషన్‌లోకి నిర్మించదల్చిన రైల్వేలైన్ నిర్మాణం అంశాన్ని ఉన్నతాధికారులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉంచినట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం అధికారులు సర్వే చేస్తున్న నాలుగు, మూడు వరుసల లైన్ల నిర్మాణం, రోడ్డు ఓవర్ రోడ్డు డబుల్‌లైన్ల పనులు పూర్తయితే రైళ్లు, గూడ్సుల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది.

ఆ రెండ్రోజులు జాగ్రత్త

● జిల్లాలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
● 16, 17న విద్యా సంస్థలకు సెలవు ● కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడి


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'రానున్న మూడు రోజులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఈ నెల 16, 17వ తేదీల్లో మరింత జాగ్రత్త అవసరం. ఈ రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు' అని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అల్పపీడనం కారణంగా జిల్లాలో విస్తారంగా వానలు కురిసే వీలుందని వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిందని కలెక్టర్ చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ఎక్కడ ఏ సమస్య తలెత్తినా సత్వరమే రంగంలోకి దిగేలా సర్వం సిద్ధంగా ఉంచామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 16, 17న అన్ని రకాల విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎవరైనా విద్యా సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిథిల గృహాల్లో ఎవరూ ఉండవద్దన్నారు. నగరంలోని మరువవంక, నడిమివంక పరివాహక ప్రాంతాల్లోని కాలనీల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

కలెక్టరేట్‌తోపాటు మున్సిపాల్టీల్లో, అనంత, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి నోడల్ అధికారి, మండల అధికారులు ఎక్కడికక్కడే ఉంటారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా సత్వరమే వాట్సాప్‌లో ఫొటో, వీడియోలు పంపాలని ఆయన సూచించారు. వంతెనల పటిష్టతపై అంచనా వేస్తున్నామన్నారు.

పండ్ల తోటల సాగు.. లాభాలు బాగు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ మండలం మర్తాడు గ్రామానికి చెందిన రైతు రామ్మోహన్‌రెడ్డి పండ్ల తోటలు సాగు చేస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. తనకున్న ఆరున్నర ఎకరాల్లో చీనీ, అరటి, సెనగ సాగు చేశారు. రెండున్నర ఎకరాల్లో ఆర్గానిక్ రకానికి చెందిన అరటి నాటారు. ముందుగా భూమిని ఐదు మడకలతో దున్నించి పేడ ఎరువులు వేశారు. ఒక్కో మొక్క రూ.12తో హైదరాబాద్ నుంచి తెప్పించారు. ఎకరాకు 1500 చొప్పున గతేడాది మేలో రెండున్నర ఎకరాల్లో 3,500 మొక్కలు నాటించారు. తెగుళ్లు వ్యాపించకుండా మందులు పిచికారీ చేశారు. కాయ నాణ్యతగా వచ్చింది. మొక్క నాటినప్పటి నుంచి కూలీ, సేద్యం ఖర్చులన్నీ కలిపి రూ.3లక్షలు పెట్టుబడి పెట్టారు. సెప్టెంబరులో కోత కోయగా ఎకరాకు 30టన్నుల చొప్పున మొత్తం 75టన్నుల దిగుబడి వచ్చింది. 7టన్నులు సూట్ పోగా 67 టన్నులను ఒక టన్ను రూ.16వేలతో విక్రయించారు. రూ.10లక్షలు రాబడి రాగా పెట్టుబడిపోను రూ.7లక్షలు మిగిలాయి.


అరటి గెల చూపుతున్న రైతు రామ్మోహన్‌రెడ్డి

రెండున్నర ఎకరాల్లో చీనీ..: పదేళ్ల కిందట రెండున్నర ఎకరాల్లో చీనీ పంట సాగు చేశారు. ఒక మొక్క రూ.100తో లింగాల మండలంలో కొనుగోలు చేశారు. ఎకరాకు రూ.150 చొప్పున రెండున్నర ఎకరాల్లో 360 మొక్కలు నాటారు. ఎర్రనేల కావడంతో భూమి మరింత సారవంతంగా ఉండేందుకు నల్లమట్టి తోలించి చెట్టు చుట్టూ వేయించారు. మొక్క నాటినప్పటినుంచి కోతకొచ్చే వరకు ఎరువులు, మందులు అన్నీ కలిపి రూ.2లక్షల పెట్టుబడి పెట్టారు. మొదటి కోతలో 10టన్నులు, రెండో కోతలో 42టన్నులు, మూడో కోతలో 8టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.16వేలు, రూ.32వేలు, రూ.48వేలు చొప్పున విక్రయించడంతో మొత్తం రూ.10లక్షల రాబడి వచ్చింది. పెట్టుబడి పోను రూ.8లక్షలు చేతికందాయి.

మార్కెట్లో ధరలు కలిసొచ్చాయి - రామ్మోహన్‌రెడ్డి

అరటి, చీనీ పంటల దిగుబడి వచ్చినప్పుడు మార్కెట్‌లో ధరలు కలిసొచ్చాయి. గత నెల ఒకటిన్నర ఎకరాల్లో రూ.10వేలు ఖర్చుపెట్టి సెనగ పంట సాగు చేశాను. సెనగ క్వింటా రూ.7వేలు పలుకుతుంది. కోతకొచ్చే సమయానికి అదే ధర కొనసాగితే పెట్టుబడిపోను రూ.40వేల వరకు లాభం వస్తుంది.

సమస్య-సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులకు ఎలాంటి సందేహలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి తగిన సలహాలు పొందవచ్చు.


నజీరుద్దీన్ (వ్యవసాయ శాస్త్రవేత్త)

సమస్య: పత్తి పంటలో పూత, పిందెలు రాలుతున్నాయి. సమస్యను ఎలా అధిగమించాలి. - నాగభూషణం (రేగడికొత్తూరు)

సమాధానం: పత్తిలో పూత, పిందెలు రాలుతుంటే రైతులు వెంటనే ఎసిటిక్ యాసిడ్ 10 పీపీఎమ్ ద్రావణాన్ని 1 మి.లీ. డైఅమ్మోనియం ఫాస్పేట్ ద్రావణంలో కలిపి పిచికారీ చేస్తే పూత, పిందెలు రాలకుండా నివారించవచ్చు.

సమస్య: వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పంటకు సుడి దోమలు ఆశించి దెబ్బతీస్తున్నాయి. నివారణకు ఎలాంటి మందులు వాడాలి. - వన్నూరేవలి, జంతలూరు

సమాధానం: వరి పైరులో సుడిదోమల ఉధృతిని గుర్తించిన వెంటనే రైతులు ఆలస్యం చేయకుండా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు, పైమెట్రోజైన్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన


నిరసన తెలుపుతున్న ఐద్వా, శ్రామిక మహిళా జిల్లా కమిటీ, సీఐటీయూ నాయకులు

హిందూపురం: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో వలస కూలీలైన అత్త, కోడలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సీఐటీయూ, ఐద్వా శ్రామిక మహిళా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వం తగిన చొరవ చూపటం లేదన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, సోషల్ మీడియా వేదికగా మహిళలపై అసభ్యకరమైన వీడియోలు పోస్ట్ చేయటం లాంటి సంఘటనలకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంత్యాజ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, వెంకటేశ్, అంగన్‌వాడీ ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి, కేవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, సీఐటీయూ పట్టణ నాయకులు వీఆర్ రాము, రామకృష్ణ, స్థానిక అంగన్‌వాడీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై చింతలరాయుడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో ప్రాచీన ఆలయమైన బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా కొనసాగాయి. ఉదయం చింతల వెంకటరమణస్వామిని మోహినీ అవతారంలో అలంకరించి ఊరేగించారు. సాయంత్రం స్వామిని గరుడవాహనంపై కూర్చోబెట్టి పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు.


పూజలందుకున్న చింతల వెంకటరమణస్వామి

విద్యుత్తు సమస్యలుంటే.. 1912 నెంబరుకు ఫోన్ చేయండి

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున విద్యుత్తు ప్రమాదాలను నివారించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. విద్యుత్తు సరఫరా సంబంధించి ఏ సమస్య వచ్చినా 1912 నెంబరుకు వెంటనే ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఇంటి పరిసరాల్లోని విద్యుత్తు స్తంభాలకు ఉన్న స్టే వైర్లకు ఇనుప తీగలు కట్టకూడదన్నారు. రైతులు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియంత్రికలను సొంతంగా మరమ్మతులు చేసుకోకూడదని ఆయన సూచించారు. తుపాను ముగిసే వరకు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చీనీ తోటల్లో తెగుళ్లకు పరిష్కారమిలా..

చిట్కా

చీనీ తోటల్లో అధిక దిగుబడి పొందాలంటే తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పంటకు ఆశించే మంగునల్లి నివారణకు డయాఫెన్ 2 మి.లీ, ప్రోపర్‌గైట్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంటకు ప్రధానంగా ఆశించే గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.3 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి నెల రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేసుకుంటే నాణ్యమైన కాయలు దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్త తెలిపారు. - న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

సెనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిద్దాం

కళ్యాణదుర్గం: రబీలో పప్పుసెనగ సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు తెలిపారు. జిల్లాలో ఎన్‌బీఈజీ 452, జేజీ-11, ఎన్‌బీఈజీ-857 వంటి పప్పు సెనగ రకాలు అనువైనవి. ఈ నెల 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు విత్తు నాటేందుకు అనువైన సమయం. విత్తుకునే ముందు కిలో విత్తనానికి 3గ్రాముల కార్బెండజియం లేదా 1.5గ్రాముల టెబుకొనజోల్, 8-10గ్రాముల ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల ఎండు తెగులును తట్టుకుని నష్టం నివారించవచ్చని చెప్పారు. విత్తనం విత్తిన 24గంటల్లోపు ఎకరాకు 1-1.2మి.లీ పెండి మిథాలిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కేవీకేలో సంప్రదించాలని తెలిపారు.

కందికి చీడపీడలు.. నివారణ చర్యలు

రైతేరాజు


సోమందేపల్లిలో సాగు చేసిన కంది పంట

కదిరి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో సాగైన కంది పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడిని కాపాడుకోవచ్చని కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రమేశ్ నాయక్ సూచించారు. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా ఎక్కువ విస్తీర్ణంలో రైతులు కందిపంట సాగు చేశారు. కందికి మొగ్గ దశలోని శనగ పచ్చ, పూతకు మరుకా మచ్చల పురుగులు ఆశిస్తాయి. పిందె, కాయ వృద్ధిచెందే సమయంలో ఈగ పురుగుల సమస్య ఉంటుందని తెలిపారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

✦ కంది మొగ్గ, పూత, పిందె దశలో శనగపచ్చ పురుగు పత్తి కాయలకు రంధ్రాలు చేసి గింజలను తింటుంది. ఇలా పంట మొత్తం వ్యాపిస్తుంది. ఈ పురుగు ఉనికిని, ఉధృతిని గమనించడానికి ఎకరాకు నాలుగు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ పురుగు గుడ్లను గమనించిన వెంటనే 5 శాతం వేపగింజల కషాయాన్ని, 2 మి.లీ. 10,000 పీపీఎం వేపనూనెను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతిని బట్టి ఇండెక్సాకార్బ్ లేదా డెల్టామెత్రిన్ 0.9 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

✦ పూత, కాయ దశలో ఆశించే మరుకా మచ్చల పురుగు (దీనినే వాడుకలో పూత, గూడు పురుగు, బూజు పురుగుగా పిలుస్తారు.) ఈ పురుగు ఒకటి, రెండు దశల్లో మొగ్గ లోపలే ఉంటుంది. తర్వాత దశలో లేత ఆకులు, పూత, పిందె, కాయలను కలిపి గూడుగా చేసుకుని కాయ లోపలికి వెళ్లి గింజలను తినేస్తుంది. తద్వారా కాయలను డొల్లగా చేస్తుంది. దీని నివారణకు స్పైనోసాడ్ 0.3 మి.లీ, నోవల్యురాన్ 1.0మి.లీ, క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ, స్పైనోటోరమ్ 0.75 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

✦ కాయ ఈగ తల్లిపురుగు లేత పిందె దశలో కాయలపై గుడ్లు పెడుతుంది. పిల్ల పురుగులు కాయలోపలికి వెళ్లి గింజలను తింటాయి. ఈ పురుగు అన్ని దశలను పూర్తి చేసుకుని తల్లిపురుగు మాత్రమే బయటకు వస్తుంది. దీని నష్టం బయటకు కనిపించదు. ఈ పురుగు నివారణకు డెల్టామెత్రిన్ ఒక మి.లీ, ఇండెక్సాకార్బ్ ఒక మి.లీ, ల్యాండా సైహలోత్రిన్ ఒక మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే పంటను కాపాడుకోవచ్చు.

బీటీపీ ఆనకట్ట నిర్మాణం పటిష్ఠం

ప్రాజెక్టును పరిశీలించిన రాము నాయక్


గేట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుగా పేరు గాంచిన బీటీపీ (భైరవానితిప్ప ప్రాజెక్టు) క్రస్ట్ గేట్లకు నీరు లీకేజీ కాకుండా రబ్బరు సీళ్లు వేయించాలని డ్యామ్ గేట్ల సేఫ్టీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (కడప డివిజన్ మెకానికల్ ఇన్‌ఛార్జి) రాము నాయక్ సూచించారు. సోమవారం బీటీపీకి చెందిన 12 క్రస్ట్ గేట్లు, ఎలక్ట్రిఫికేషన్, జనరేటర్ పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు ఆనకట్ట నిర్మాణం పటిష్ఠంగా ఉందన్నారు. వరద వస్తే అత్యవసరంగా గేట్లు ఎత్తేందుకు విద్యుత్తు సౌకర్యం అధ్వానంగా ఉందని, జనరేటర్ల రక్షణకు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాజెక్టు కాపలాకు లస్కర్లను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాకపోవడంతో సొంత నిధులతో చిన్నచిన్న పనులు చేయించామని, లస్కర్ల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు రాయదుర్గం చిన్న నీటి పారుదల శాఖ డీఈ బలరాముడు తెలిపారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని రామూనాయక్ హామీ ఇచ్చారు. ఆయన వెంట జేఈ సాయిరాం తదితరులు ఉన్నారు.

విద్యుత్తు సమస్య తలెత్తకుండా చర్యలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: వ్యవసాయానికి విద్యుత్తు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ సురేంద్ర సిబ్బందికి సూచించారు. ఈ నెల 12వ తేదీ కొడవండ్లపల్లి విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట రైతులు కార్యాలయానికి తాళంవేసి విత్యుత్తు అంతరాయంపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎస్ఈ పరిశీలించి ఉపకేంద్రంలోని మరమ్మతులను చేయించారు. ఇకపై రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తామని తెలిపారు. ఎస్ఈతోపాటు ఇన్‌ఛార్జి ఏఈ శివతేజ పాల్గొన్నారు.


సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్ర

18న ఈ-పంట నమోదు తుది జాబితా విడుదల

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: 'సామాజిక తనిఖీలో భాగంగా జిల్లాలో గత ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ముసాయిదా జాబితాను ఈనెల 16వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రదర్శిస్తారు. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించి జాబితా చదివి వినిపిస్తారు. ఏమైన అభ్యంతరాలుంటే గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులకు రాత పూర్వకంగా అందజేయాలని' జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో మొత్తం 10,54,356 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశామన్నారు. 2,97,072 మంది రైతులు ఉంటే 2,85,340 మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. సవరణ కోసం ప్రభుత్వం చివరి అవకాశం ఇచ్చిందన్నారు. ఈనెల 18న తుది జాబితా విడుదల చేస్తామని, ఆ తర్వాత మార్పులు, చేర్పులు ఉండవని డీఏవో స్పష్టం చేశారు.

పప్పుసెనగ విత్తనాలకు 13,397 మంది పేర్లు నమోదు

జిల్లాలో రబీలో పప్పుసెనగ రాయితీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 18,808 క్వింటాళ్ల విత్తనం కావాలని 13,397 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. జిల్లాకు 27 వేల క్వింటాళ్ల విత్తనం కేటాయించగా, 6 వేల క్వింటాళ్లను రైతు సేవా కేంద్రాలకు తరలించి సిద్ధంగా ఉంచామని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య తెలిపారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని బీటీ ప్రాజెక్టు గ్రామానికి చెందిన చిన్నారి కృష్ణకిశోర్ (6) సోమవారం నీటి సంపులో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వన్నూరప్ప, జ్యోష్నల కుమారుడు కృష్ణకిశోర్ మధ్యాహ్నం నుంచి కనబడలేదని గ్రామ శివార్లలో వెతికారు. సాయంత్రం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉన్న నీటి సంపులో శవమై తేలాడు. పిల్లలు ఆడుకుంటూ దేవాలయం వద్దకు వెళ్లారని, ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి మృతి చెందినట్లు తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.


కృష్ణకిశోర్

కూలికి వెళ్లి కుప్పకూలి..

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో కూలి డబ్బులు అడిగేందుకు వెళ్లి యజమాని ఇంటి వద్ద కూలి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. హనుమంతు గ్రామంలో విద్యుత్తు స్టార్టర్, పంచాయతీలో వీధి దీపాలు వేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో మోటారుకు సంబంధించిన స్టార్టర్ పెట్టెను ఆదివారం మరమ్మతు చేశాడు. సాయంత్రం కూలి డబ్బులకు రైతు ఇంటి వద్దకు వెళ్లి, అక్కడ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గుండెపోటుతో మృతి చెందినట్లు అందరూ భావిస్తున్నా, తన భర్త మృతిపై భార్య నాగమ్మ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


హనుమంతు

మద్యం దుకాణం కోసం ఉద్రిక్తత

యాడికి, న్యూస్‌టుడే : యాడికిలో నూతన మద్యం దుకాణం ఏర్పాటు విషయమై సోమవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇది వరకే రహదారి పక్కనే నడుస్తున్న దుకాణంలోనే తిరిగి ఏర్పాటు చేసేందుకు టెండర్లు దక్కించుకున్న తెదేపా, వైకాపా వర్గీయులు పోటీ పడ్డారు. దుకాణ యజమానితో తనకే ఇవ్వాలని ఓ వర్గం ముందుగానే సంప్రదింపులు చేసుకోగా, మాకే ఇవ్వాలంటూ తెదేపా వర్గీయులు పట్టుబట్టారు. దుకాణం వద్దకు ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఐ ఈరన్న చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. తెదేపా, వైకాపా నాయకులతో చర్చించి, అక్కడి నుంచి దూరంగా పంపడటంతో సమస్య సద్దుమణిగింది.

హైడ్రామా నడుమ ముగిసిన అపహరణ వ్యవహారం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : పుట్టపర్తిలో మద్యం లాటరీ నిర్వహించిన సాయిఆరామం వద్ద జరిగిన చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్ కిడ్నాప్ వ్యవహారం హైడ్రామా మధ్య ముగిసింది. తన భర్తను కిడ్నాప్ చేశారని ఆచూకీ తెలియజేయాలని అతని భార్య అశ్విని సాయిఆరామం వద్ద ఆందోళన చేపట్టారు. రంగనాథ్ తననెవరూ కిడ్నాప్ చేయలేదని హిందూపురం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు తెలియజేశారు. తన ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో తనను కిడ్నాప్ చేశారని అనుకుని తన భార్య భయభ్రాంతులకు గురై ఆందోళన చేసిందన్నారు. తన భర్తను తనకు అప్పగించాలని పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ దగ్గర బంధువులతో కలిసి ఆందోళనకు దిగిన ఆమెతో చరవాణిలో భర్తను మాట్లాడించినప్పటికీ ఒప్పుకోలేదు. ఎట్టకేలకు హిందూపురం నుంచి రంగనాథ్‌ను పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌కు తీసుకొచ్చి భార్య, ఇతర కుటుంబ సభ్యులకు డీఎస్పీ విజయకుమార్ అప్పగించారు. తననెవరూ కిడ్నాప్ చేయలేదని పుట్టపర్తి పోలీసులకు రంగనాథ్ తెలిపారు.



డీఎస్పీ విజయకుమార్‌తో మాట్లాడుతున్న రంగనాథ్

అత్యాచార ఘటనలో నిందితుడిపై కేసు

తాడిమర్రి, న్యూస్‌టుడే : తాడిమర్రి మండలానికి చెందిన యువకుడు వినయ్ కుమార్‌పై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వినయ్‌కుమార్ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 19 ఏళ్ల యువతిపై నిందితుడు పలుమార్లు అత్యాచారం చేసినట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్యాచారం కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. గతంలో ఈ యువకునిపై పోక్సో కేసు నమోదైందన్నారు.

మమ్మల్ని బస్సెక్కించి.. నువ్వు పాడెక్కావా భాస్కరా

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : మమ్మల్ని బస్సెక్కించి.. బైకులో వస్తానంటూ పాడెక్కావా భాస్కరా అంటూ కుటుంబ సభ్యులు రోదించినతీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. కదిరి మండలం పట్నం వద్ద జాతీయరహదారి 42పై లారీ - ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో భాస్కర్ (24) మృతి చెందారు. పట్నం గ్రామానికి చెందిన భాస్కర్ ఉపాధి కోసం అనంతపురం వెళ్లి అక్కడే కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. పాల వ్యాను డ్రైవర్‌గా పనిచేసే అతను భార్య సీమంతం కోసం స్వగ్రామమైన పట్నానికి శనివారం వచ్చారు. ఆదివారం బంధువులు, మిత్రులతో కలిసి సీమంతం వేడుక, విందుతో సంతోషంగా గడిపారు. తాను సాయంత్రం ద్విచక్ర వాహనంపై వస్తానన్న తల్లిదండ్రులు, భార్య లక్ష్మిని సోమవారం ఉదయం అనంతపురం బస్సెక్కించారు. సొంతూరులో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై రాత్రి అనంతపురం బయలుదేరిన నిమిషాల వ్యవధిలోనే హంద్రీ నీవాకాలువ మోరీ వద్ద లారీ ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కదిరి ఆసుపత్రికి తరలించారు. భార్య సీమంతం కార్యక్రమంలో బంధువులు, కుటుంబ సభ్యులు సందడిగా గడిపిన ఆ ఇంట విషాదం అలుముకుంది. భాస్కర్ మరణవార్త తెలుసుకున్న భార్యలక్ష్మి, తల్లిదండ్రులు, గుండెలు పగిలేలా రోదించారు. కదిరి గ్రామీణ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ మోహన్ తెలిపారు.


భాస్కర్

దైవ దర్శనానికి వెళ్తూ.. కానరాని లోకాలకు

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు


కరియన్న

కణేకల్లు, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన కరియన్న (56) అనంత లోకాలకు చేరుకున్నారు. ఈ ఘటన సోమవారం కణేకల్లు మండలం యర్రగుంట శివారు రైస్‌మిల్లు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా.. బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి దర్శించుకుని, మాల ధరించడానికి కుందుర్పి మండలం కొత్తూరుకు చెందిన బావమరిది వెంకటేశులుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. యర్రగుంట శివారు రైసు మిల్లు వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కరియన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటేశులు గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

జలాశయం వద్ద కుటుంబీకులకు మంత్రి సవిత ఓదార్పు


చంద్రశేఖర్‌రెడ్డి


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లి జలాశయంలో ఆదివారం గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(19) మిత్రులతో కలిసి ఆదివారం గొల్లపల్లి జలాశయానికి ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఆదివారం రాత్రి వరకు అగ్నిమాపకశాఖ సిబ్బంది గాలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సోమవారం ఉదయం జలాశయం వద్దకు వెళ్లారు. అప్పటికే యువకుడి మృత దేహం నీటిలో తేలడంతో బయటకు తీశారు. యువకుడి మృత దేహానికి మంత్రి సవిత నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటరమణ వివరించారు.

కారులో గొర్రె అపహరణ.. పట్టుకున్న పోలీసులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : జీవాల మందలో ఉన్న ఓ గొర్రెను కారులో వేసుకుని అపహరించుకుపోతున్న నిందితులను గాండ్లపెంట పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని కోలార్‌కు చెందిన తిప్పన్న కుటుంబ సభ్యులు తంబళ్లపల్లి వద్ద నుంచి కారులో ప్రయాణిస్తున్నారు. వారు ఎద్దులొల్లకోట వద్ద మందలో ఉన్న ఒక గొర్రెను కారులో వేసుకుని అపహరించుకుని వెళుతుండగా గ్రామస్థులు చూసి గొర్రెల యజమాని నరసింహులుకు సమాచారం ఇచ్చారు. బాధితుడు కారును వెంబడిస్తూ పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు అప్రమత్తమై రెక్కమాను వద్ద కారును ఆపే ప్రయత్నం చేశారు. అక్కడ కారు నిలపకుండా గాండ్లపెంట వైపు వెళుతుండగా గాండ్లపెంట పోలీసులకు సమాచారం తెలపడంతో కానిస్టేబుల్ భాస్కరరాజు కారును ఆపే ప్రయత్నం చేశారు. కారు వేగంగా వస్తుండటంతో వెంటనే ప్రధాన రహదారిపై బొలెరో, తాగునీటి ట్యాంకు వాహనం అడ్డంగా పెట్టించడంతో వచ్చిన కారు వాటిని ఢీకొట్టి ఆగింది. వెంటనే అక్కడికి చేరుకుని వారిని పట్టుకున్నారు. వెంటనే స్టేషన్‌కు తరలించి విచారించారు. అనంతరం తంబళ్లపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు వచ్చి విచారించి వారిని అదుపులోకి తీసుకుని కారుతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.


నిందితులతో తంబళ్లపల్లి పోలీసులు

మామిడి మొక్కల నరికివేత

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం మండలం మల్లేనిపల్లికి చెందిన భాజపా నాయకుడు పూజారి నరసింహులు వ్యవసాయ తోటలో 35 మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. సోమవారం వ్యవసాయతోటకు వెళ్లిన నరసింహులు తోటలో మామిడి మొక్కలు నరికివేసిన విషయం గమనించారు. రెండేళ్ల వయసు ఉన్న మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారని ధర్మవరం గ్రామీణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.


ధ్వంసమైన మామిడి మొక్కలు

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ



గంధం ఊరేగింపులో ముస్లిం సోదరులు

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: మహబూబ్ సుబాని జెండా కట్ట కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు నిర్వహించారు. సోమవారం రాత్రి అనంతపురం రోడ్డులోని జెండా కట్ట నుంచి టీ కూడలి వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం జెండా కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 30 ఏళ్లుగా ఇక్కడ గ్యార్మీ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, కులాలు, మతాలకు అతీతంగా అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ప్రిన్సిపల్ రఘురామమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీ ట్రెక్కింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించడంపై అభినందనలు తెలియజేశారు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు తిరుపతి, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పోటీలు నిర్వహించగా ఎన్‌సీసీ ట్రెక్కింగ్ విభాగంలో కర్నూలు తరుపున శివప్రసాద్, జి.గోపాల్‌లు ప్రాతినిధ్యం వహించి గెలుపొంది బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఎన్‌సీసీ టీసీవో కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు పది అర్జీలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కార వేదికకు పది అర్జీలొచ్చాయి. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ వినూత్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి పలు భూ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. తహసీల్దార్లతో చరవాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

మున్సిపల్ డీఈ బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపల్ డీఈగా రవిప్రకాష్ నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు కార్పొరేషన్ నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చారు. ఇప్పటికే కర్నూలు జిల్లా గూడూరు నుంచి ఏఈ నరసింహులు, ధర్మవరం నుంచి మరొక ఏఈ ప్రతాప్‌లు బదిలీపై రాయదుర్గం వచ్చారు. పట్టణంలోని వివిధ అంశాలపై చర్చించేందుకు సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం నుంచి రానున్న మూడు రోజులు వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు పడే అవకాశాలున్నట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివాసం ఉండకూడదన్నారు. వాగులు, వంకలు, నదులు దాటరాదని, అత్యవసర సమయాల్లో మాత్రమే ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే చరవాణి నంబరు 89199 12230ను సంప్రదించాలన్నారు.

ఉరవకొండ: భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని లత్తవరం తండాలో సోమవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. భార్య భర్తల విషయంలో విభేదాలను అడ్డుగా పెట్టుకుని ఓ వర్గం పాతకక్షలను ప్రేరేపిస్తూ ముందుగా గొడవకు దిగినట్లు తెలిసింది. మరో వర్గం కూడా వాటిని ధీటుగా ఎదుర్కోవడంతో ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పలువురు వైకాపా వర్గీయులు పోలీసులపై కూడా దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. అయితే ఘర్షణలో ఇరువర్గాల తరుపున ఆరు మందికి గాయాలయ్యాయి. చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఘటనపై సీఐ సురేశ్‌బాబు ఆరా తీశారు.

యువకుడి ఆత్మహత్య

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: దసరా పండగకు కొత్త దుస్తులు కొనివ్వలేదని మనస్తాపానికి గురై ఓ యువకుడు హెచ్చెల్సీలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మురడికి చెందిన నాగేంద్రకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండో కుమారుడు రుద్రప్ప (15) తండ్రికి తోడుగా వ్యవసాయ పనులకు వెళ్లేవాడు. దసరా పండగకు కొత్త బట్టలు కొనివ్వలేదని రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే రోజు సాయంత్రం తాను చనిపోతానని కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడి, ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మండలంలోని గొడిశలపల్లి సమీపంలో హెచ్చెల్సీలోకి దూకినట్లు స్థానికులు చెప్పడంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. కణేకల్లు మండలం యర్రగుంట సమీపంలో శవమై తేలినట్లు చెప్పారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

ఖాళీ స్థలాలు.. విషకీటకాలకు స్థావరాలు



కళ్యాణదుర్గం: పార్వతీనగర్‌లో ఇళ్ల మధ్య పెరిగిన ముళ్లపొదలు

కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం పట్టణం, ఉరవకొండ, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ పట్టణాల్లో ఖాళీ స్థలాలు విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. ఏపుగా ముళ్లపొదలు పెరగడంతో అడవిని తలపిస్తున్నాయి. వర్షపునీరు నిల్వ ఉండి దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి అధికమైంది. ఎలుగుబంట్లు, విషపురుగులు అధికమై ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

● కళ్యాణదుర్గం పట్టణంలో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు దట్టంగా అలుముకొన్నాయి. అధికారులు మాత్రం 22 మాత్రమే ఉన్నాయని చెబుతున్నా.. సుమారు వంద వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి. పార్వతీ నగర్, బసవేశ్వరకాలనీ, విద్యానగర్‌లో చీకటి పడితే ఎలుగుబంట్లు సంచారం చేస్తుండటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఒంటిమిద్ది, రాచప్పబావి తదితర కాలనీల్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. పందులు అవాసాలుగా చేసుకోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రాయదుర్గం పట్టణంలోని చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. గాంధీ పాఠశాల సమీపంలోని రెండు ఇళ్లల్లో ఇటీవలే పాములు కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. మున్సిపల్ కార్యాలయం వెనుక రాధాకృష్ణ పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో ముళ్లపొదలు పెరిగడంతో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. సెయింట్‌పాల పాఠశాల సమీపంలో రెండు ఎలుగుబంట్లు ముళ్ల పొదల్లో చేరుకోవడంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు.

● ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రతి శని, ఆదివారాల్లో సుమారుగా 5 వేల మంది భక్తులు, పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. దీంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్లు దివాకర్‌రెడ్డి, వంశీకృష్ణభార్గవ్‌లను వివరణ కోరగా.. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ముళ్లపొదల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముళ్లపొదలతో ఇబ్బందులు



ఇళ్ల సమీపంలో ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఇటీవల ఎలుగుబంట్లు చొరబడటంతో భయాందోళనకు గురయ్యాం. అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్లపొదలను తొలగించాలి. **-రూపేశ్, రాయదుర్గం**

భయాందోళన చెందుతున్నాం



కాలనీ సమీపంలో ఖాళీ స్థలం ఉండటంతో విషపురుగులకు ఆవాసంగా మారింది. ఇళ్లలో పాములు కనిపించడంతో భయాందోళనకు గురవుతున్నాం. వర్షపునీరు నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు అనారోగ్యాల బారిన పడుతున్నాం.

-మారెన్న, ఒంటిమిద్ది, కళ్యాణదుర్గం

12వ పీఆర్‌సీని ప్రకటించాలి



నగదు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి బసన్న

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీని ప్రకటించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, తిప్పేస్వామి డిమాండ్ చేశారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘానికి విశ్రాంత ఉద్యోగి బసన్న రూ.16,116, సోమశేఖర్ రూ.5 వేలు విరాళం ఇచ్చారు. అనంతరం పలు అంశాలపై చర్చించుకున్నారు. అదనపు క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని, మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులు మారెన్న, అంజనప్ప, భగవాన్‌దాస్, ఫకృద్దీన్, చెన్నప్ప, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జరుట్ల రాంపురంలో చిరుత సంచారం



కొండపై సంచరిస్తున్న చిరుత

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని జరుట్ల రాంపురంలో శ్రీరామలింగేశ్వరుని ఆలయ సమీపంలోని కొండపై సోమవారం చిరుత సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మూడురోజులుగా సమీపంలోని కొండ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందన్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం కొండ ప్రాంతం మీదుగా వెళ్లాల్సి ఉండటంతో అటువైపు వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి చిరుతను బంధించి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

రోడ్లపై మూగజీవాలతో ప్రమాదాలు



పట్టణంలోని గాంధీ, టీకూడలి, బళ్లారి రోడ్డు, అనంతపురం మార్గంలో నిత్యం మూగజీవాలు గుంపులుగా సంచరిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులను వివరణ కోరగా.. పశువుల యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

పాచి ఇలా.. నీరెలా..

పట్టణంలోని సాయినగర్‌లో చిన్న నీటి ట్యాంకుల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ట్యాంకు కింది భాగంలో పాచి పట్టడంతో నీటిని పట్టుకోవడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జారితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు గుర్తించి శుభ్రత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే శుభ్రం చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, ఉరవకొండ



రోడ్డెక్కిన ముళ్లపొదలు



మండలంలోని శ్రీరంగాపురం నుంచి బూదవర్తి వెళ్లే ప్రధాన రహదారిని ముళ్లపొదలు కప్పేశాయి. గ్రామ చెరువు కట్ట కింద సుమారు 300 మీటర్ల వరకు ముళ్లపొదలతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. ముళ్లపొదలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, బెళుగుప్ప



రాయదుర్గం పట్టణం: సోమలాపురంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలవ



కళ్యాణదుర్గం గ్రామీణం: బోరంపల్లిలో మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు



ఉరవకొండ: సాయినగర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

గత వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలు, గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నాయకులు, అధికారులు పేర్కొన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సోమవారం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల నిర్మాణాలకు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. గ్రామాల రూపురేఖలు మారనున్నట్లు అభిప్రాయపడ్డారు. కూటమి నాయకులు, అధికారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బృందం



గుమ్మఘట్ట: సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

వరుస చోరీలతో బెంబేలు

☛ పనిచేయని నిఘా నేత్రాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: చోరీలు అధికమవుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నియంత్రించే దిశగా చేపడుతున్న చర్యలు నామమాత్రమే. దీనికి తోడు దొంగల ఆనవాళ్లను గుర్తించడానికి ఉపకరించే సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. నివాస గృహాలు, బ్యాంకుల్లో చోరీలు చోటు చేసుకుంటున్నాయి.

● ఈనెల 4న ఉరవకొండ గవిమఠం పరిసరాల్లోని ఓ కిరాణా దుకాణంలో రూ.4 లక్షలు చోరీ జరిగింది. మరో రెండు దుకాణాల్లో యత్నించారు.

● ఈనెల 5న బూదగవిలో వ్యవసాయదారుని ఇంట్లో చోరీ చోటు చేసుకోగా రూ.1.49 లక్షలు, ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

● ఈనెల 6న పట్టణ శివారు జాతీయ రహదారిలో చిరు వ్యాపారికి చెందిన కిరాణ బంకులో చోరీ జరిగింది.

● ఈ ఏడాది ఆగస్టు 5న ఉరవకొండ ఎస్‌బీఐలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న రైతు ద్విచక్ర వాహనం నుంచి రూ.3 లక్షలు చోరీకి గురయ్యాయి.

● ఈ ఏడాది ఆగస్టు 20న ఉరవకొండలో వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఓ ఇంట్లో పది తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి.



అలంకారప్రాయంగా సీసీ కెమెరా

కొరవడిన నివారణ చర్యలు..

ఉరవకొండలో ప్రధాన దారులతో పాటు కాలనీల్లోని వీధుల్లో పోలీసులు ప్రజా భాగస్వామ్యంతో 24 చోట్ల నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. మరమ్మతుకు గురై చాలా కాలంగా పని చేయడం లేదు. చోరీ జరిగినా ఆనవాళ్లను గుర్తించడానికి అవకాశం లేకుండా పోయింది. తగిన సమయంలో రికవరీ కూడా జరగడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు చోరీల నివారణకు చర్యలు చేపడుతూ, సీసీ కెమేరాలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

గస్తీని ముమ్మరం చేశాం

చోరీల నివారణకు పట్టణంలో రాత్రి పూట గస్తీని ముమ్మరం చేశాం. ఊళ్లకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేస్తున్నాం. రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాం. సీసీ కెమేరాలను అందుబాటులోకి తేవడానికి ప్రజల భాగస్వామ్యాన్ని తీసుకుంటాం. **- సురేశ్‌బాబు, సీఐ**

హడావుడిగా పప్పుసెనగ విత్తన పంపిణీ



కణేకల్లులో విత్తనం పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలో రాయితీ పప్పు సెనగ విత్తన పంపిణీ హడావుడిగా ప్రారంభమైంది. వ్యవసాయ అధికారులు కనీస సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడుగా స్థానిక నాయకులు, సిబ్బందితో పంపిణీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని మాల్యాం, కళేకుర్తి గ్రామాలకు 150 క్వింటాళ్ల చొప్పున సరఫరా అయిందని, మాల్యాంలో సోమవారం సాయంత్రం పంపిణీ ప్రారంభించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ విషయమై వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. రెండు గ్రామాలకు 300 క్వింటాళ్ల పప్పుసెనగ నిల్వలు చేరాయని, రైతులు ఒత్తిడి చేస్తుండటంతో ఏడీఏ సూచన మేరకు సిబ్బందిచే పంపిణీ చేయించినట్లు తెలిపారు.

ఉరవకొండ: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కౌకుంట్ల ఎంపీటీసీ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి శుభకర్ పేర్కొన్నారు. సోమవారం కౌకుంట్లలో రాయితీ పప్పుసెనగ విత్తన పంపిణీని ప్రారంభించారు. రైతుల డిమాండుకు అనుగుణంగా విత్తనాన్ని తెప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: బొమ్మనహాళ్ నుంచి ఉరవకొండకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలు పడి ఇబ్బందిగా ఉంది. **- వన్నూరుస్వామి,**

సమాధానం: పరిశీలించి తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం. **- రవిశంకర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ**

సమస్య: బొమ్మనహాళ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి. **- విద్యార్థినులు**

సమాధానం: సమస్యను ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- మోహన్‌కుమార్, ప్రిన్సిపల్**

సమస్య: శెట్టూరు - కళ్యాణదుర్గం ప్రధాన రహదారిలో అక్కడక్కడ గుంతలు పడటంతో ప్రమాదకరంగా మారింది. **- లింగప్ప**

సమాధానం: ఆర్‌అండ్‌బీ ఇంజినీరుతో మాట్లాడి గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకుంటాం. **- ఎంపీడీవో, రఘురామ్‌రావు**

సమస్య: మండల కేంద్రంలోని సచివాలయం, ఆర్డీటీ పాఠశాల వద్ద సీసీ రోడ్లపై మురుగు నిల్వతో అపరిశుభ్రంగా ఉంది. **- తిప్పేస్వామి**

సమాధానం: గుంతలు పూడ్చి సమస్యను పరిష్కరిస్తాం. **- కుమార్, సర్పంచి**

– బొమ్మనహాళ్, శెట్టూరు, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



ఎంఈవోలను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని యూటీఎఫ్ కూడేరు మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, వెంకటప్ప ఎంఈవోలను కోరారు. కూడేరు ఎంఈవోలుగా గౌస్‌బాషా, సాయికృష్ణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధి కార్యక్రమాలను అమలుతో పాటు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడు సంపత్‌కుమార్, నాయకులు సిద్దన్న, దస్తగిరి, రామచంద్ర పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని గోనేహాళ్‌లో సోమవారం మట్కా పట్టీలు రాస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

ప్రజాప్రతినిధిపై దాడి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ ప్రజాప్రతినిధిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు సమాచారం. రెండు రోజుల కిందట రాత్రి పూట ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుమ్మఘట్ట మండలం దేవిరెడ్డిపల్లి సమీపంలో కొందరు అడ్డగించి చితకబాదినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై యూపీఎస్ సీఐ జయనాయక్‌ను వివరణ కోరగా.. ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బొలెరో బోల్తా.. తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోళ్ల సమీపంలో అదుపుతప్పి బొలెరో వాహనం బోల్తాపడిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. ఆపిల్ పండ్లను అనంతపురం నుంచి కళ్యాణదుర్గం తరలిస్తుండగా గోళ్ల బైపాస్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు స్వల్పగాయాలయ్యాయి. గ్రామస్థులు వాహనాన్ని బయటకు తీసి కళ్యాణదుర్గం పంపారు.

బస్సులు రాక.. ప్రయాణికుల తిప్పలు



కళ్యాణదుర్గం గ్రామీణం: బస్సులో సీటు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు ముగియడంతో ఇతర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు, పలు చోట్ల నివాసమంటున్న వారు వెళ్లేందుకు సోమవారం కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిక్కిరిసింది. పండగ అనంతరం ప్రత్యేక సర్వీసులు నడపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నా, ఇక్కడి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బస్సుల కొరత ఏర్పడింది. బస్టాండ్‌లో కంట్రోల్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి, ఇద్దరు టీఏ బాధ్యత వారు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం రామచంద్రను వివరణ కోరగా.. ఉన్న బస్సు సర్వీసులు నడుపుతున్నామని, కొంత ఆలస్యం కావడంతోనే సమస్య నెలకొందన్నారు. తర్వాత అందుబాటు ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఉరవకొండ: ఉరవకొండ ప్రయాణ ప్రాంగణంతో పాటు బస్సులన్నీ నిండుగా కనిపించాయి. ఏ బస్సు వచ్చినా సీటు కోసం ప్రయాణికులు పరుగులు తీస్తూ కనిపించారు. చాలా మంది గంటల కొద్ది నిరీక్షించాల్సి వచ్చింది. ప్రయాణికులు అవస్థలు పడి గమ్యస్థానాలకు చేరారు.

సరిహద్దులో మట్కా జోరు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండల సమీపంలోని కర్ణాటక సరిహద్దులో మట్కా నిర్వహణ జోరందుకుంది. రోజు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఎంతోమంది ఆర్థికంగా నష్టపోతూ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బొమ్మనహాళ్‌కు కూతవేట దూరంలో బహిరంగంగా మట్కా నిర్వాహకులు కొంతమందిని నియమించుకుని పట్టీలు రాయిస్తున్నారు. బొమ్మనహాళ్‌తో పాటు డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాలు సరిహద్దులో ఉన్నందున ఆయా మండలాల్లో యథేచ్ఛగా మట్కా నిర్వహిస్తున్నారు. మట్కా, పేకాటలను అరికట్టేందుకు అనంతపురం, బళ్లారి ఎస్పీలు సమావేశమై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆయా మండలాల పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా కర్ణాటక ప్రాంతంలో దాడులు చేయడానికి తమకు అనుమతి లేదని తెలిపారు.

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అవకతవకలపై విచారణ జరిపించాలి

గుంతకల్లు (గ్రామీణం), న్యూస్‌టుడే: వరద ప్రభావిత ప్రాంతంలో పరిహారం పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి సురేష్ డిమాండు చేశారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు రామాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. వరదప్రాంతాల్లో పంపిణీ చేసిన పరిహార విషయంలో మరోసారి విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీనాయకులు రఘునాథ్‌రెడ్డి, మహబూబ్ బాషా, గోపీ పాల్గొన్నారు.

ఈ-పంటల సామాజిక తనిఖీ జాబితా ప్రదర్శన

గార్లదిన్నె, న్యూస్‌టుడే : రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ పంట సామాజిక తనిఖీ పరిశీలన కోసం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో జాబితాను ప్రదర్శించినట్లు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. సోమవారం జమ్ములదిన్నె రైతు సేవా కేంద్రంలో రైతుల జాబితా ప్రదర్శన కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. జాబితాలో ఉన్న పేర్లను రైతులు సరిచూసుకోవాలని ఏవైనా తప్పులు ఉంటే రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఈ నెల 18వ తేదీన రైతుల తుది జాబితా ప్రదర్శించనున్నట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు. రైతులు జాబితాను సరిచూసుకోవాలని కోరారు.

ఏటీఎంలో నగదు చోరీకి విఫలయత్నం

నార్పల, న్యూస్‌టుడే : నార్పలలో ఓ ఏటీఎంలో నగదు చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. నార్పల కూతలేరు వంతెన శివారులో ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి చోరీ చేయడానికి దుండగులు వచ్చారు. ఏటీఎంను పాక్షికంగా ధ్వంసం చేశారు. ఎంతకూ ఏటీఎం నగదు తలుపులు తెరుచుకోక పోవడంతో పారిపోయారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. సీఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ ఏటీఎంలో నగదు చోరీకి గురికాలేదని, చోరీకి యత్నించిన దుండగులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.


పాక్షికంగా ధ్వంసమైన ఏటీఎం

టీ స్టాల్ ధ్వంసంపై ఫిర్యాదు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని సాయితేజ థియేటర్ సమీపంలో ఉన్న టీ స్టాల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మధుకుమార్ అనే వ్యక్తి టీ స్టాల్ పెట్టుకుని జీవనం సాగించేవాడు. దసరా సందర్భంగా రెండు రోజులపాటు టీస్టాల్ మూసివేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి టీ స్టాల్‌లోని పలు సామగ్రిని ధ్వంసం చేశారని బాధితుడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో మారణాయుధాలు.. కేసు నమోదు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పోరాట కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో మారణాయుధాలు లభించడంతో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. సోమవారం పోరాట కాలనీలోని పలు ఇళ్లల్లో తనిఖీలు చేస్తుండగా రామాంజనేయులు అనే వ్యక్తి ఇంట్లో వేటకొడవళ్లు , ఇనుప రాడ్లు లభించడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో అపహరణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని కూరగాయల మార్కెట్ వద్ద ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గంగినాయుడు ఆటో నడుపుతూ ఉండేవాడు. ఆటోను కూరగాయల మార్కెట్ వద్ద నిలిపి నిత్యావసర సరకులు కొనేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు అపహకరించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ వివరించారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

యల్లనూరు(పుట్లూరు), న్యూస్‌టుడే: యల్లనూరు మండలంలోని తిమ్మంపల్లిలో మట్కా నిర్వహిస్తూ ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న లడ్డూ సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు రూ. 20 వేలు విలువచేసే మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాంప్రసాద్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తుపాను వేళ అప్రమత్తం

యాడికి, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఏర్పడే తుపాన్ వల్ల అప్రమత్తంగా ఉండాలని మండల అధికార యంత్రాంగానికి ప్రత్యేక అధికారి రామంజనేయులు ఆదేశించారు. స్థానిక సమావేశపు భవనంలో సోమవారం కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపినందున, ఇక్కడి ప్రదేశాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలోకి వెళ్లి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించి, నివాసం ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ వీర్రాజు, ఈఓఆర్డీ శశికళ, వైద్యులు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగితాల్లోనే విద్యుత్తు ఆదా

- క్షేత్రస్థాయిలో పగలు, రాత్రి వెలుగులు
- తప్పని బిల్లుల భారం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలో విద్యుత్తును ఆదాచేయాలన్న ఆలోచన కాగితాలకే పరిమితమైంది. ఎక్కడా ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీధిదీపాలు పగలు, రాత్రి వెలుగుతున్నాయి. నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.


చెట్నేపల్లిలో పగలే వెలుగుతున్న విద్యుత్తుదీపం

నాలుగేళ్ల పాటు బాధ్యతలు

విద్యుత్తు ఆదా చేసే బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని ఈఈఎస్ఎల్ కంపెనీకి నిర్వహణ బాధ్యతను నాలుగేళ్లపాటు అప్పగించారు. ఆ కంపెనీ కాంట్రాక్టు గడువు నాలుగు నెలల కిందట ముగిసింది. పట్టణంతోపాటు గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగనపల్లిలలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. మొత్తం 3,800 దీపాలు ఉన్నాయి. మరో 600 దీపాలు శివారుకాలనీల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది.

రూ.80 లక్షల బకాయిలు

వీధిదీపాలున్న చోట్ల పగలు, రాత్రి వెలుగుతున్నాయి. ఈకారణంగా నెలవారీ విద్యుత్తు బిల్లులు తడిసి మోపెడవుతోంది. ఇప్పటికే పురపాలిక అధికారులు దీపాలు, నీటి పథకాల నిర్వహణకు నెలకు రూ. 13 లక్షల బిల్లు చెల్లించాల్సి వస్తోంది. రూ. 80 లక్షల వరకు బకాయి పడ్డారు.

నిర్వహణ అస్తవ్యస్తం

చెట్నేపల్లి, గుత్తిఆర్.ఎస్.లోని దళితవాడ, కర్నూలు రోడ్డు, బీసీకాలనీ, తోళ్లషాపు, వంకరగడ్డవీధి, నల్లగడ్డవీధి తదితర కాలనీల్లో దీపాలు సక్రమంగా వెలగడంలేదు. చాలా చోట్ల పగలు, రాత్రి వెలుగుతుండగా మరికొన్ని చోట్ల రాత్రిళ్లు వెలగడంలేదు. నేసేకాలనీ, కోట, తాడిపత్రిరోడ్డు, అనంతపురం రోడ్లలో పదుల సంఖ్యలో దీపాలు వెలగడంలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

-జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి

గుత్తిపురపాలికలో విద్యుత్తు ఆదాకు చర్యలు తీసుకుంటాం. అనేక వార్డుల్లో పగలు,రాత్రి దీపాలు వెలుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు మూడో మరికొన్ని ఏర్పాట్లు చేయించేందుకు విద్యుత్తుశాఖను అంచనా వేయాలని కోరాం. ఎంత మొత్తం చెల్లించాలో తెలియజేయాలని సూచించాం. విద్యుత్తు అధికారులు కోరిన మొత్తాన్ని చెల్లిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

పామిడి, న్యూస్‌టుడే

సమస్య : పామిడిలోని భోగేశ్వర ఆలయం సమీపంలోని షావుకార్ స్ట్రీట్‌లో ఇళ్ల మధ్య మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. **- మంజునాథ్**

సమాధానం: రెండు రోజుల్లో కాలువలను శుభ్రం చేయిస్తాం. **- గోపాల్,ఈఓ**

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే



సమస్య: గుంతకల్లులోని ఫక్కీరప్ప కాలనీలో సీపీఐ స్తూపం వద్ద రోడ్డు పక్కన పవర్ బోరు ట్యాంక్ లీకేజీ అవుతోంది. **- వెంకటేశులు**

సమస్య: నాగలకట్ట వీధిలో పవర్ బోరు ట్యాంక్‌కు నీరు రావటం లేదు. **-వెంకటేశులు, స్థానికుడు.**

సమాధానం: రెండు ట్యాంకుల సమస్యలను పరిష్కరిస్తాం **- హరికృష్ణ, ఏఈ**

సంబరంగా.. పల్లె పండగ

- అభివృద్ధి పనులకు భూమి పూజ

తాడిపత్రి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం సారథ్యంలో ప్రతి పల్లె ప్రగతి బాటన పడనుందని తెదేపా మహిళా రాష్ట్ర కార్యదర్శి పులిచెర్ల లావణ్య పేర్కొన్నారు. సోమవారం చిన్నపొలమడలో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ఫజిల్, మండల ఇంజినీర్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ముచ్చుకోటలో పల్లె పండుగలో భాగంగా సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. రూ. 27 లక్షలతో సీసీ రహదారులు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో శకుంతల, మండల ఇంజినీర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం, నార్పల : తెదేపా, జనసేన కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పల్లెపండగ వారోత్సవాలను నార్పల, బుక్కరాయసముద్రం మండలాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. బుక్కరాయసముద్రంలో ఎంపీపీ సునీత సీసీ రహదారుల పనులను భూమిపూజ చేశారు. మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

● నార్పలలో ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి రూ. 88 లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎంపీడీవోలు సల్మాన్‌రాజ్, గంగావతి, ఈవోఆర్డీ శైలజ, సదాశివం, సర్పంచులు పార్వతి, సుప్రియ పాల్గొన్నారు.

పామిడి : పల్లెపండగలో భాగంగా నీలూరులో రూ. 10లక్షలతో, తంబళ్లపల్లిలో రూ. 10లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ రాజేంద్రకృష్ణకుమార్, తెదేపా నాయకులు రమేశ్, ముసలిరెడ్డి, రాజేశ్‌నాయక్, హరీశ్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పల్లెపండుగలో భాగంగా సోమవారం తిమ్మాపురం, అప్పేచెర్ల, రావులుడికి, భీమునిపల్లి గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చూశారు. మండల ప్రత్యేకాధికారి వెంకటరమణనాయక్, ఎంపీడీవో బారెన్‌సాహెబ్, ఈవోఆర్డీ నరసింహారెడ్డి, ఏపీవో పుల్లారెడ్డి, గృహనిర్మాణశాఖ ఏఈ నెట్టికంటయ్య పాల్గొన్నారు.


తాడిపత్రి : పల్లె పండగలో పాల్గొన్న తెదేపా నాయకులు, అధికారులు

గుంతకల్లు గ్రామీణం : నెలగొండ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. దంచెర్ల గ్రామంలో ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. గుమ్మనూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి, రూరల్ ఎస్సై రాఘవేంద్రప్ప, తెదేపా పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, సర్పంచి నారాయణస్వామి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గార్లదిన్నె, గార్లదిన్నె గ్రామీణ : గార్లదిన్నెలో పల్లె పండగలో భాగంగా సోమవారం సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇల్లూరులో రూ. 10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు, నాయకులు భూమి చేశారు. ఎంపీడీవో యోగానంద రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, ఏపీవో నాంచారమ్మ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శింగనమల : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శింగనమల, సలకంచెరువు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు పూజలు చేశారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏపీఓ శ్రీదేవి, తెదేపా నాయకులు వెంకటేశ్, సత్యనారాయణ, వెంకటనారాయణ, శంకర్, ఎంపీటీసీ విజయ, మాసుల చంద్రమోహన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

పుట్లూరు : పల్లెపండగ నిర్వహణలో భాగంగా కడవకల్లు, సూరేపల్లి గ్రామాల్లో ఎంపీడీవో అలివేలమ్మ రూ. 1.10 కోట్లతో సీసీ రోడ్లు, పారిశుద్ధ్య పనులకు భూమి పూజ చేశారు. ఏపీఓ చెన్నకేశవులు, ఉపాధిహామీ సిబ్బందితో పాటు స్థానిక సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పురపాలిక కార్యాలయానికి మహర్దశ

నూతన భవనానికి రూ.2 కోట్లు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలిక కార్యాలయానికి సొంత భవన నిర్మాణానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2011లో పురపాలిక ఏర్పాటైంది. అప్పట్లోనే ప్రభుత్వం రూ. 50లక్షలు స్టాట్ గ్రాంటును కార్యాలయ భవనాల కోసం మంజూరు చేసింది. నిధులున్నా పనులు జరగలేదు. కాలక్రమంలో అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వం తాజాగా రూ. 2 కోట్లను విడుదల చేసింది. రూ. 50 లక్షలతో పూర్తి కావాల్సిన భవనాలు రూ. 2. 50 కోట్లకు చేరుకుంటోంది. కార్యాలయానికి పక్కా భవనాలను నిర్మించేందుకు టెండర్లను నిర్వహించగా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేకపోయారు.



నూతన భవన నిర్మాణ ప్రాంతమిదే

ఇరుకు గదుల్లో కష్టంగా..

సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో కార్యాలయం నడుస్తోంది. ఇరుకైన గదుల్లో కార్యాలయాన్ని అధికారులు అతికష్టం మీదుగా నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పరిపాలన, మెప్మా తదితర విభాగాలు చిన్న చిన్న గదుల్లో కొనసాగుతున్నాయి. ఆస్తి పన్నుల వసూలు కేంద్రం చిన్నగదిలో నడుస్తోంది. పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు నిలబడాల్సి వస్తోంది. కమిషనర్ ఛాంబర్‌లోనూ పది మంది కూడా కూర్చునేందుకు స్థలం లేదు. కార్యాలయం నిర్వహణకు సాంఘిక సంక్షేమశాఖకు ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నారు. సొంత భవనాలు సమకూరితే ప్రజలు, ఉద్యోగుల సమస్యల తీరుతాయి. భవనాల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు నిర్వహిస్తామని కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు.


తాడిపత్రిలో కేకు కోసి వృద్ధురాలికి తినిపిస్తున్న తెదేపా నాయకులు

తెదేపా శ్రేణుల సంబరాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తనయుడు జేసీ ధీర్ దివాకర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను సోమవారం తాడిపత్రిలో ఘనంగా నిర్వహించారు. తెదేపా పట్టణాధ్యక్షుడు రజాక్ మాట్లాడుతూ శ్రీకృష్ణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు అందజేసి కేకు కోసి సంబరాలు జరుపుకొన్నట్లు తెలిపారు. ఆవుల తిప్పాయపల్లి గ్రామంలో ఉన్న రమణమహర్షి అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు పఠనా సామగ్రి అందజేసి, అన్నాదానం చేశామన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి అయూబ్‌బాషా, నాయకులు నూర్ బాషా, కందన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దందా అరికట్టాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పరిసరాల్లోని పెన్నానదిలో నుంచి భారీగా ఇసుకను తరలిస్తున్నారని, వాటిని వెంటనే అరికట్టాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్నానదిలో వందల సంఖ్యలో రజక సోదరులు దుస్తులు శుభ్రం చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఇసుకాసురులు పని ప్రదేశంలో ఇసుకను తరలిస్తూ గుంతలు పెడుతున్నారన్నారు. దీనివల్ల రజకులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇసుకను తోడటంతో తాడిపత్రి ప్రజలకు తాగునీటికి అవస్థలు పడే ప్రమాదం ఉందన్నారు. సీపీఐ నాయకులు పురుషోత్తం, రామేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేష్, నాగరంగయ్య పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి

యాడికి, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద భాజపా తాడిపత్రి నియోజకవర్గ కో-కన్వీనర్ పొట్టే గంగాధర్, మండల అధ్యక్షుడు చింతా చౌడయ్య మాట్లాడారు. దేశానికి పది సంవత్సరాలకు పైగా ప్రధానమంత్రిగా ఉన్న మోదీ చిత్రపటాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. నాయకులు రఘువీరాచారి, జయరాముడు, సురేశ్, జగదీశ్, రంగస్వామి, పండు లక్ష్మీదేవి పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భాజపా నాయకులు

అక్కరకురాని ఉద్యానశాఖ భవనం

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలోని ఉద్యాన శాఖ భవనం నిరుపయోగంగా మారింది. భవనంలో ఆశాఖకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉంటూ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు వివిధ సూచనలు, సలహాలివ్వాల్సి ఉంది. భవనం నిర్మించి ఆరేళ్లు దాటినా ఇప్పటిదాక తెరచిన పాపానపోలేదు. రూ. లక్షలు ఖర్చు చేసి భవనాన్ని నిర్మించింది వృథాగా మార్చేందుకేనా అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. మండలంలోని సిబ్బంది రైతు కేంద్రాల్లో ఉంటున్న కారణంగా వినియోగించడం లేదని ఉద్యానశాఖ అధికారిణి ఉమాదేవి చెప్పడం గమనార్హం.


నిరుపయోగంగా మారిన ఉద్యానశాఖ భవనం

గుంతల రోడ్డుతో తిప్పలు

గుంతకల్లులోని ఫక్కీరప్ప కాలనీకి వెళ్లే దారిలో సిద్ధేశ్వర్ కాలనీ వద్ద రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. గతంలో పైపులైన్ నిర్మాణం కోసం తవ్వకాల చేపట్టారు. సీసీరోడ్ల మధ్యలో గుంతల ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతుల చేపట్టాలని స్థానికులు మున్సిపల్ ఇంజినీర్లను కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం



రూ.లక్షలు పోశారు.. నిర్వహణ మరిచారు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని ఎస్ఎస్‌ట్యాంకు సమీపంలోని బెంచికొట్టాల వద్ద ఏర్పాటు చేసిన పార్కులో మున్సిపల్ అధికారులు రూ. లక్షలు ఖర్చు చేసి వ్యాయామ పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నిర్వహణ సరిగా లేక ముళ్లకంపల మధ్య దర్శనమిస్తున్నాయి. ఇక్కడికి వెళ్లడానికి రహదారి లేకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. దీనిపై మున్సిపల్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు తొలగించి వ్యాయామ, క్రీడా పరికరాలను వినియోగంలోకి తెస్తామన్నారు.


వృథాగా ఆట పరికరాలు

తాగునీరు పట్టుకునేదెలా..?

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి అంబేడ్కర్‌నగర్‌లో సచివాలయం వద్ద ఉన్న తాగునీటి ట్యాంకు చుట్టూ పెద్దఎత్తున మురుగు చేరుతోంది. అక్కడే ఉన్న మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు బయటకు వచ్చి ట్యాంకు వద్ద చేరడంతో నీరు పట్టుకునేందకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై మున్సిపల్ ఏఈ తేజ స్పందిస్తూ ఇటీవలే ఆప్రాంతంలో మురుగు బయటకు రాకుండా పరిష్కరించాం. అయినా మరోసారి పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.


అంబేడ్కర్‌నగర్‌లో తాగునీటి ట్యాంకు చుట్టూ చేరిన మురుగు

బీసీ బాలికల గురుకులానికి ఐఎస్‌ఓ గుర్తింపు

నార్పల, న్యూస్‌టుడే : నార్పలలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది. కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం ప్రిన్సిపల్ సంగీత పురస్కారాన్ని అందుకున్నారు. 2021లో ఏర్పాటైన ఈ గురుకులంలో ప్రస్తుతం 330 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ సంగీత కుమారి పాఠశాల రూపురేఖలు పూర్తిగా మార్చేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు పర్యావరణ అనుకూల పద్ధతుల గురించి విద్యార్థులకు బోధిస్తున్నారు. విద్యాలయ ఆవరణలో పెరటితోటను ఏర్పాటు చేసి పురుగు మందులు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో డిస్కవర్ అనంతపురం స్వచ్ఛంద సంస్థ సహకారంతో వ్యర్థాలతో గృహ అలంకరణ సామగ్రి తయారీపై శిక్షణ ఇస్తున్నారు.

● విద్యాలయంలో వెలువడే వ్యర్థాలతో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి మొక్కలకు ఎరువుగా వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇన్ని ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకొని ఐఎస్ఓ గుర్తింపు కోసం దరఖాస్తు చేయగా గుర్తింపు రావడం విశేషం.


ఐఎస్‌ఓ గుర్తింపు పత్రాన్ని ప్రిన్సిపల్ సంగీతకు అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజల సహాయార్థం హెల్ప్‌లైన్

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ జబ్బార్‌మియా కోరారు. సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురువనుండటంతో లోతట్టు ప్రాంతాల్లో మురుగు కాలువలల్లో పూడికతీత చేపడతామన్నారు. వర్షాలు వస్తే పునరావాస కేంద్రాలు మూడు ఏర్పాటు చేశామన్నారు. విపత్తులు వస్తే వెంటనే ప్రజలు కంట్రోలు రూం చరవాణి : 91009 86895కు ఫోన్ చేయాలని కోరారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం

గార్లదిన్నె : కోప్పలకొండ సమీపంలో గ్రామదేవత చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. గ్రామపెద్దల అధ్వర్యంలో సాయంత్రం ఐదుగంటల నుంచి గ్రామపురవీధుల గుండా జ్యోతులను ఊరేగించారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయం వద్ద జ్యోతులతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు



కానుకలు లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

హుండీ ఆదాయం రూ.22.48 లక్షలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను సోమవారం లెక్కించారు. కానుకల రూపేణా రూ.22,48,779 ఆదాయం వచ్చినట్లు ఈవో బాబు తెలిపారు. గతంలో రూ.9.96లక్షల ఆదాయం వచ్చింది. గతంతో పోలిస్తే ఆదాయం పెరిగిందన్నారు. వచ్చిన నగదును ఆలయ ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. త్వరలో ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

కాలువల్లో వ్యర్థాల తొలగింపు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తుండటంతో నగరంలోని కాలువల్లో ఎక్కడా వ్యర్థాలు, పూడిక అడ్డు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రారంభమైన పూడికతీతను మేయర్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. తుపాను హెచ్చరికలు రావడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా నడిమి వంక, మరువ వంక పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వంతెనలు, కల్వర్టుల వద్ద అడ్డంగా ఉన్న వాటిని పూర్తిగా తొలగించాలన్నారు. ఉపమేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మురుగు కాలువలు అధ్వానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ పాఠశాలల వద్ద అపరిశుభ్రత నెలకొంది. ప్రధానంగా మురుగు కాలువల్లో పూడిక తొలగించడం లేదు. చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్డెక్కుతుంది. గతంలో కురిసిన వర్షాలకు పాతూరులోని ప్రభాకర్‌జీ, మొరార్జీ, ఆషా, జాకీర్‌హుసేన్, షాతాజ్, భారతి, 15వార్డు, ఎన్‌వీఆర్ తదితర పాఠశాలల వద్ద మురుగు రోడ్డుపై చేరింది. పాఠశాలల వద్ద స్వచ్ఛత నెలకొల్పడంలో నగరపాలక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొన్ని నెలలుగా పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదు. మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో నగరవాసులు బెంబేలెత్తుతున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛత నెలకొల్పడం ముఖ్యం. జిల్లాలో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాఠశాలల వద్ద ఉన్న కాలువలను శుభ్రం చేయించాలని, స్వచ్ఛత నెలకొల్పాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.



పాతూరులోని ప్రభాకర్‌జీ నగర పాలక ప్రాథమిక పాఠశాల వద్ద మురుగుతో నిండిన కాలువ

గుల్జార్‌పేట.. సమస్యల మేట

కాలనీ :	గుల్జార్‌పేట
జనాభా :	6వేలు
ఓటర్లు :	4వేలు
నివాస గృహాలు :	900

గుల్జార్‌పేట, న్యూస్‌టుడే: నగరంలోని గుల్జార్‌పేట కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. ముస్లింలు అధికంగా నివాసం ఉంటున్న ఈ కాలనీలో కనీస వసతులు కరవయ్యాయి. ఏ వీధిలో చూసిన మురుగుతో నిండిన కాలువలు, దెబ్బతిన్న కల్వర్టులు.. రోడ్లపై అస్తవ్యస్తంగా పారుతున్న మురుగు దర్శనమిస్తుంది. కొన్నేళ్లుగా ఈ సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు.. తీరా గెలిచాక కన్నెత్తి చూడటం లేదని వాపోయారు. గుల్జార్‌పేట కాలనీ పరిధిలో ప్రకాశ్ రోడ్డు, ఆదిమూర్తినగర్, సరోజినిరోడ్డు, కోర్టు రోడ్డు ప్రాంతాలు వస్తాయి. ఇక్కడ మసీదు, కొత్తూరు అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. పండగ రోజుల్లో భక్తుల రద్దీ ఉంటుంది. ఇరుకు దారులు కావడంతో వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం ఏర్పడుతోంది. పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వర్షం కురిస్తే వాహనాలు రోడ్లపై రాలేని పరిస్థితి ఉంది. మురుగు కాలువలు, కల్వర్టులు సక్రమంగా లేకపోవడమే ఇందుకు కారణం. కాలువలు మురుగుతో నిండిపోయి దుర్వాసన వస్తుందని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. నెలలు గడుస్తున్న ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన మురుగును శుభ్రం చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైన నగర పాలక అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య కాలువలో పేరుకుపోయిన మురుగు



దెబ్బతిన్న కల్వర్టు

కాలువలు నిర్మించాలి

పదేళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నాం. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయంగా ఉంటుంది. వీధుల్లో పందుల సంచారం అధికమైంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. గతంలో కొత్తగా రోడ్లు వేస్తే సంతోషించాం. కాలువలు నిర్మించకపోవడంతో మురుగు సమస్య అధికంగా ఉంది. కాలువలు నిర్మించాలి. **- షబానబేగం, స్థానికురాలు**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- ముత్యాలప్ప, నారాయణస్వామి**

సమాధానం: వెంటనే ఏర్పాటు చేయిస్తాం.

- హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఆర్‌కేనగర్ ఇందిరాగాంధీ పాఠశాల, ఉద్యానవనానికి మధ్యలో మలుపు వద్ద మురుగు కాలువపై సిమెంటు పలక ఏర్పాటు చేయాలి.

- ప్రదీప్‌కుమార్

సమాధానం: పలకలు ఏర్పాటు చేస్తాం.

సమస్య: ఐదో రోడ్డులో చెత్త బిన్నులు నిండినా తొలగించడం లేదు. **- మహేశ్**

సమాధానం: సిబ్బందిని పంపి తొలగిస్తాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు.)

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక

సమస్యకు పరిష్కారం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని రైల్వే అండర్ పాస్ నుంచి పలు మార్గాలకు వెళ్లే ప్రాంతంలో కంకర తొలగించి తారు రోడ్డు వేశారు. అర్థాంతర పనులతో అవస్థలు, వామ్మో స్రరున జారాల్సిందే శీర్షికన ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. అధికారులు స్పందించి తారురోడ్డు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండగ



ఆత్మకూరులో భూమిపూజ నిర్వహిస్తున్న అధికారులు, తెదేపా నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆత్మకూరు, పి.యాలేరు గ్రామాల్లో సోమవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీనరసింహ, తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు ప్రారంభించిందన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం రెండు గ్రామాల్లో రూ.80లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, శశాంక్ చౌదరి, ఏపీవో సుజాత, ఈవోఆర్డీ కామక్క, తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని హంపాపురం, బండమీదపల్లి గ్రామాల్లో సోమవారం 'పల్లె పండుగ' వారోత్సవాలు నిర్వహించినట్లు ఎంపీడీవో విజయలక్ష్మీ తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు, ఇతర పనులకు సంబంధించి రూ.3.17కోట్లతో భూమిపూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో సావిత్రి, ఎంపీటీసీ సభ్యుడు రవి, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి దిబ్బలు మరిచారు



నగరంలోని బళ్లారి బైపాస్‌లో విభాగినుల వద్ద పేరుకుపోయిన మట్టిని తొలగించారు. దాన్ని అక్కడే కుప్పలుగా పోసి వదిలేశారు. తిరిగి ఆ మట్టి అంతా మళ్లీ రోడ్డుపై పడుతోంది. దాంతో మట్టిని తొలగించినా ప్రయోజనం లేకుండా పోతోంది. జిల్లాలో నాలుగు రోజులపాటు తుపాను ఉండటంతో వర్షం వస్తే మళ్లీ అదంతా రోడ్డుపైకి కొట్టుకొని వచ్చే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు మట్టి దిబ్బలను తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక

ప్రజారోగ్యానికి పొగ



నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ నుంచి రుద్రంపేటకు వెళ్లే మార్గంలో పార్వతమ్మ కాలనీ వద్ద జాతీయ రహదారిపై చెత్త పడేసి అంటిస్తున్నారు. దాంతో పొగ వ్యాపించి అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు పొగ, మరోవైపు మురుగు నడిమి వంకలోకి కలిసే మార్గంలో సక్రమంగా వెళ్లడం లేదు. ఈ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వస్తుంది. జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీ ఉంటుంది. పొగ రోడ్డును కమ్మేస్తుండటంతో ఎప్పుడు ఏ వాహనం ఢీకొంటుందోనన్న భయం నెలకొంది. **- న్యూస్‌టుడే, రాణినగర్**

నష్ట పరిహారం అందించాలని వినతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ కోరారు. స్థానిక తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు సోమవారం సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది ప్రజలు పంటలు సాగు చేసినా వర్షాలు లేక నష్టపోయారని అన్నారు. కేంద్ర బృందం వచ్చి నష్టాన్ని అంచనా వేసినా ఎలాంటి పరిహారం అందించలేదని వివరించారు. ఎన్డీఏ ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివ, రామాంజనేయులు, గోపాల్ నాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి డిమాండ్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి, తాత్కాలిక సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 15 సంవత్సరాల నుంచి సహాయాచార్యుల పోస్టులు భర్తీ చేయలేదని, దాంతో బోధన కుంటుపడుతోందన్నారు. దశాబ్దాలుగా కాంట్రాక్టు, టైంస్కేల్, దినసరి వేతనాల కింద వేల మంది పని చేస్తున్నారని, వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పదవి బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 77 ఫిర్యాదులు

అనంత నేరవార్తలు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జగదీశ్ పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. నేరుగా బాధితులతోనే మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను ఆయా స్టేషన్ల అధికారులతో తెలిపారు. చట్టపరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలను సూచించారు. కుటుంబ కలహాలు, భార్యాభర్తల గొడవలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై 77 ఫిర్యాదులు అందాయి.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న కారు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న సరకు రవాణా వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి 44వ జాతీయ రహదారి కూడలి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కలబురగి(గుల్బర్గా)కు చెందిన నలుగురు మిత్రులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. దసరా పండగకు స్వగ్రామాలకు వెళ్లి తిరిగి బెంగళూరు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి సరకు రవాణా వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో వీరేశ, సంగనాథ్, సిద్ధలింగ తీవ్రంగా గాయపడ్డారు. కారు నడుపుతున్న హరీశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అత్యవసర వాహనంలో సీకేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ర్యాపిడో.. ఉబర్.. ఓలా.. వంటి యాప్‌ల మూలంగా దశాబ్దాల కాలంగా ఆటోలను నమ్ముకుని జీవిస్తున్న తమ పొట్ట కొట్టొద్దంటూ ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. సోమవారం ఏఐఎఫ్‌టీయూ అనుబంధ అనంత నగర ఆటో డ్రైవర్ల సంఘం సారథ్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత ఎన్జీఓ హోం నుంచి టవర్ క్లాక్, రఘువీరా కాంప్లెక్సు, రాజీవ్ సర్కిల్, సూర్యనగర్ రోడ్డు, సంఘమేశ్ సర్కిల్, ఆకాశవాణి మీదుగా కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. పలు రకాల యాప్‌లు ఆటో డ్రైవర్ల జీవనోపాధిని హరిస్తున్నాయని ఆవేదన చెందారు. సత్వరమే ఆ యాప్‌లను రద్దు చేయాలని డిమాండు చేశారు. కుటుంబాల పోషణ, ఇంటి అద్దెలు, సరకులు, పిల్లల చదువులు.. ఇలా అన్నీ భారంగా మారాయన్నారు. అనంతరం కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. నిరసనలో ఆటో కార్మికుల సంఘం నాయకులు రాజా, హాజీవలి, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు సుధాకర్, నాగభూషణం, రైతు కూలీ సంఘం, స్త్రీ విముక్తి సంఘటన, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

కార్మికుల సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలపై అధికారులు చొరవ చూపడం లేదని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆరోపించారు. సోమవారం నగరపాలకలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాయకులు సమస్యను విన్నవించారు. పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు అనారోగ్యంతో మృతి చెందితే ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నగర విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరినా పెడచెవిన పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, నాగరాజు, తిరుమలేష్, రాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



స్రవంతి

రాప్తాడు, న్యూస్‌టుడే: మండలంలోని గొందిరెడ్డిపల్లి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న స్రవంతి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ సోమవారం తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. విద్యార్థినిని ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పీడీ రవితేజ, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళలు హక్కులపై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: మహిళలు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శివప్రసాద్ యాదవ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యాలయంలో సోమవారం మహిళలకు హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ భ్రూణ హత్యల నుంచి బాలికలు చదువుకునే చోట విద్యాభ్యాసం అయిపోయే దాకా అవసరమైన చట్టాలు ఉన్నాయన్నారు. ఉద్యోగం, ఉపాధి పొందుతున్న కార్యాలయాల్లో రక్షణ కోసం చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలకు అవసరమైన హక్కులను రాజ్యాంగం కల్పించిందన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో డిఫెన్సు ఛీఫ్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్ యాదవ్

చర్చిల మరమ్మతులకు సహకరిస్తాం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: నగరంలోని చర్చిల మరమ్మతులకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని జీసస్‌నగర్‌లో ఉన్న ఫెయిత్ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ క్రైస్తవులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం 15ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. పాస్టర్లకు రావాల్సిన మూడు నెలల వేతనం త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, పాస్టర్లు విజయ్‌కుమార్, నాగరాజు, అధ్యక్షుడు పాస్టర్ పీ మార్కు, కార్యదర్శి ఆనంద్, తెదేపా నాయకుడు సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఆశీర్వచనాలు ఇస్తున్న పాస్టర్లు

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: వర్సిటీలో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత హెచ్చరించారు. ర్యాగింగ్ నిర్మూలనకు సంబంధించిన గోడపత్రాలను సోమవారం ఇన్‌ఛార్జి వీసీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం ఉండాలన్నారు. ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు పాల్పడితే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థులు భావిజీవితాన్ని నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ప్రిన్సిపల్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనిత, ఆచార్యులు

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

రాజీవ్‌కాలనీ(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఫీజు కట్టలేక చదువు మానేసి పనికి వెళ్లాలనుకున్న ఓ విద్యార్థినికి ఎన్ఆర్ఐ ఒకరు ఆర్థిక సాయం అందించారు. అనంతపురం గ్రామీణ మండలం రాజీవ్‌కాలనీకి చెందిన ఎస్.రుబియా నలంద కళాశాలలో ఇంటర్ చదువుతుంది. ప్రథమ సంవత్సరంలో 436 మార్కులు సాధించి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతున్న బాలిక కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేదు. ఆటోడ్రైవర్‌గా పని చేసే తండ్రికి ప్రమాదం జరగడంతో ఫీజు కట్టలేని పరిస్థితి. దాంతో కళాశాలకు వెళ్లడం మానేసింది. ఆర్ట్సు కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ బి.మురళీధర్‌రావు, బ్రాహ్మణ మహిళా సంఘం ప్రతినిధి వై.రమాదేవి బాలిక ఇంటికి వెళ్లి వారి దీనస్థితిని గుర్తించారు. అమెరికాలో ఉంటున్న వారి కుమార్తె బి.స్రవంతికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆమె వెంటనే రూ.20 వేలు కళాశాల ఫీజు కోసం పంపించారు. స్థానికులు రవీంద్రారెడ్డి, మునీరా, సంజీవరత్న, జయశ్రీ స్పందించి విద్యార్థిని దుస్తులు, పుస్తకాల కోసం సాయం అందించారు. ప్రతిభావంతులైన పేదల చదువు ఫీజు కారణంగా ఆగిపోకూడదు. ఇలాంటి వారికి సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు బి.మురళీధర్‌రావు తెలిపారు. సోమవారం నలంద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఖాజీబాబుకు మొత్తం ఫీజును బి.మురళీధర్‌రావు అందజేశారు. భవిష్యత్తులో రుబియా చదువు కోసం అవసరమైన ఖర్చులు అందజేస్తామని భరోసా ఇచ్చారు.



బాలికకు నగదు అందజేస్తున్న విశ్రాంత ప్రిన్సిపల్ మురళీధర్‌రావు

పిల్లలకు అతి స్వేచ్ఛ ఇవ్వొద్దు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలకు అతి స్వేచ్ఛను ఇవ్వొద్దని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. 2024-25 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ప్రిన్సిపల్ పాల్గొని మాట్లాడారు. మొదట విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోనే వసతి గృహాలు ఉన్నాయని, విద్యార్థులకు అనవసరంగా ద్విచక్రవాహనాలు, కార్లు కొనివ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలిగి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్‌సోనియా, హెచ్‌వోడీలు షంషాద్‌బేగం, నవీన్‌కుమార్, మధు, చలపతి, డాక్టర్ శ్యాంప్రసాద్, గాలేటి చంద్రశేఖర్, పద్మశ్రావణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు

చెట్టు కొమ్మలు తొలగించండి



కమలానగర్: **న**గరంలోని సైపుల్లా బిడ్జి రైల్వే ఫీడర్ రోడ్డు సమీపంలో ఉన్న నియంత్రికకు చెట్టు కొమ్మలు తాకుతుండటంతో నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో తరచూ విద్యుత్తు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న రోడ్డులో నియంత్రికకు చెట్టు కొమ్మలు ప్రమాదంగా మారాయి. వాటిని తొలగించి ప్రమాదాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: గంగ, త్రివేణి, నీలిమ: వేట్టయాన్, **గాయత్రి:** మార్టిన్, **గౌతమి :** జీబ్రా, **గౌరి, ఎస్వీ సినిమాక్స్, సుధా:** దేవర, **తరంగిణి:** విశ్వం, **తేజస్విని:** మా నాన్న సూపర్‌హీరో.

స్వచ్ఛత ఏదీ?



దిశ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో పిచ్చిమొక్కలు



హెచ్చెల్సీ ఇంజినీరింగ్ కార్యాలయాల సమీపంలో..

నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పిచ్చిమొక్కలు పెరిగి పాములు, విషపురుగులకు ఆవాసంగా మారింది. ప్రధానంగా ఎమ్మార్వో కార్యాలయం, హెచ్చెల్సీ ప్రాజెక్టుకు సంబంధించిన పలు ఇంజినీరింగ్ కార్యాలయాలతోపాటు దిశ పోలీస్ స్టేషన్ వద్ద కంపచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. హెచ్చెల్సీ ఉద్యోగుల నివాస గృహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. వీటిని తొలగించకుండా వదిలేశారు. నిత్యం కార్యాలయాలకు అధికారులు, సిబ్బంది, పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. ఎప్పటికప్పుడు కార్యాలయాల పరిసరాలు శుభ్రం చేయించాలని నగర వాసులు కోరుతున్నారు.

- ఈనాడు, అనంతపురం

ముంపు ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అనంత నగరపాలక: ముంపు ప్రభావిత ప్రాంతాలను సోమవారం కలెక్టరు వినోద్‌కుమార్ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఆయన తక్షణమే తగు చర్యలు చేపట్టాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కువ కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నడిమి వంక, మరువ వంకల్లో పూడికతీత వేగంగా పూర్తి చేయాలన్నారు. తుపాను వల్ల భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో నడిమి వంక ప్రభావిత ప్రాంతాలైన రజకనగర్, సోమనాథ్‌నగర్, ఐదు, ఆరవ రోడ్లు, రంగస్వామి నగర్, ఎంజీ కాలనీ, యువజన కాలనీలను పరిశీలించారు. మరువ వంక ప్రభావిత ప్రాంతాలైన నారాయణ కళాశాల, త్రివేణి థియేటర్, ఖాజా నగర్, అమ్మవారి చెరువు వంకకు సమీపంలో ఉన్న అశోక్‌నగర్ బ్రిడ్జి, హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అన్ని ప్రాంతాల్లో మంగళవారం ఉదయాన్నే జేసీబీలు, ఇటాచీలు పెట్టి పూడిక తీత ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నగర కమిషనరు నాగరాజు, ఆర్డీఓ వసంతబాబు, నగరపాలక ఎస్ఈ భాస్కర్‌రావు, ఈఈలు షాకీర్ హుస్సేన్, రాధాకృష్ణ, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి పాల్గొన్నారు.



రజకనగర్‌లో పర్యటిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్, కమిషనర్ నాగరాజు